

ఇంద్రాది కథల్లో సైన్స్
- పోలిశెట్టి బ్రదర్స్

ఓం గం గణపతయే నమః

హైందవ ప్రాచీనతను నిరూపించే విష్వద్రేఖాచలనంపై
పరిశీలనాత్మక గ్రంథం

ఇంద్రుడి కథల్లో సైన్స్

(ప్రాచీన భారతీయులకు విష్వద్రేఖ తెలియదా!)

- పోలిశెట్టి బ్రదర్స్

వేదాలు, పురాణాలు, ఇతిహాసాలలో గల ప్రాచీన హిందూ విజ్ఞాన ప్రగతిని తెలియజేసే గ్రంథ మాలికలోని తొమ్మిదవ పుష్పం.

విషయ సూచిక

ఉపోద్ఘాతం

వేదాలు, పురాణాలు, ఇతిహాసాలలో అనేక చోట్ల ఇంద్రుడు కనిపిస్తూంటాడు కదా! ఆ ఇంద్రుడు దుర్మార్గుడు, స్త్రీలోలుడు, అసమర్థుడు అని చాలామంది నిందిస్తుంటారు. అందుకు కారణం వేదాలు, పురాణాలలో గల ఇంద్ర కథలే. ఇంద్రుడు గోవులను కొల్లగొట్టేవాడుగా, శతృవుల పై దొంగదాడి చేసి మోసంతో శత్రు సంహారం చేసేవాడుగా, పరులను చూసి ఓర్వలేని వాడుగా, స్త్రీలను చెరబట్టి లేక మోసం చేసి మానభంగం చేసేవాడిగా, ఈ ఇంద్రకథలు కనిపిస్తూంటాయి కదా! అందుకే చాలా మంది ఇంద్రుణ్ణి చెడ్డగానే భావిస్తారు.

కానీ ఏదయినా ఆపద కలిగినపుడు విష్ణుదేవుడి వద్దకు పరుగెత్తి ఆయనను శరణు వేడుతాడు ఇంద్రుడు. అపుడు విష్ణుదేవుడు సహాయం చేసి ఇంద్రుడి శతృవులను నిర్జించి ఇంద్రుడికి ఇంద్ర పదవిని ఇప్పించటం కూడా అనేకసార్లు జరిగినట్లుగా పురాణాల్లో కనిపిస్తుంది. మరి విష్ణువు శిష్టరక్షకుడు, దుష్టశిక్షకుడు కదా! మరి దుర్మార్గుడైన ఇంద్రుణ్ణి యెందుకు రక్షిస్తుంటాడు? అంటే... శ్రీమహావిష్ణువు తప్పు చేశాడనుకుందామా? లేక ఇంద్రుడిలో ఏ దోషం లేదనుకుందామా? శ్రీమహావిష్ణువు నిజంగా శిష్ఠ రక్షకుడే అని మనం విశ్వసించి తీరాలి. కనుక ఆయన రక్షణ పొందిన ఇంద్రుడు నిజంగా మంచివాడు సమర్థుడు అయి వుండాలి. అందుకే అతన్ని ఇంద్రపదవిలో కొనసాగించారు.

మరి ఈ వేద, పురాణ కథల మాట యేమిటి? ఆ కథల అంతరార్థాలు తెలుసుకుంటే ఈ సమస్య విడిపోతుంది. ఇంద్రుడిని మంచివాడిగా వివరిస్తున్నామని మేము ఇంద్రుడి అభిమానులని అనుకోకండి. మేము శ్రీమహావిష్ణువు అభిమానులం. ఆయన ఏది చేసినా కరక్టే చేస్తాడని నమ్మిన వాళ్ళం. అందుకే ఆయన రక్షణలో వున్న ఇంద్రుడు మంచివాడే. అవుతాడని మా అభింప్రాయం. అందుకే ఈ చిన్న పుస్తకాన్ని వ్రాస్తున్నాం.

అంతేకాదు ఈ ఇంద్రకథల్లో గల విశేషాల వలన మన హిందూ ఋషులు కనుగొన్న అపారమైన సైన్సు విషయాలను వెలికి తీసి అందరికీ తెలియజేసి మన ప్రాచీన భారత విజ్ఞాన వైభవాన్ని లోకానికి చాటాలనే ఈ పుస్తకాన్ని వ్రాస్తున్నాం.

ఈ ఇంద్ర కథల్లో ఎంతో సైన్సు వుంది. ఆ సైన్సు విషయాలను మనవారు పాశాచత్యులకంటే ఎన్నో వేల ఏళ్ళపూర్వమే కనుగొన్నారని చెప్పటం కోసమే ఈ పుస్తకం వ్రాస్తున్నాం.

మరియు ఇలాంటి సైన్సు విషయాలు అందరూ తెలుసుకోవలసిన విషయాలు కనుక సరళమైన తెలుగులో వివరించటం కోసమే ఈ పుస్తకాన్ని వ్రాస్తున్నాం.

విజ్ఞులందరూ చదివి తమ అభిప్రాయాలను తెలియజేయ కోరుతున్నాము.

ఋగ్వేదంలో 149 దేవతలు ప్రస్తావించబడ్డారు. వారిలో అందరికంటె ఎక్కువగా ఇంద్రుడు స్తుతించబడ్డాడు ప్రత్యేకంగా 250 సూక్తాల్లోనూ, ఇతర దేవతలతో కలసి 50 సూక్తాల్లోనూ, స్తుతించబడ్డాడు.

ఋగ్వేదంలో విభాగాలు రెండు విధాలుగా చెప్పబడ్డాయి.

1. ఋగ్వేదం 10 మండలాలు, 85 అనువాకాలు, 1027 సూక్తాలు, 10552 ఋక్కులు (శ్లోకాలు)గా విభజింపబడింది.

2. కాత్యాయన పద్ధతిలో ఋగ్వేదం 8 అష్టకాలు, = 64 అధ్యాయాలు, 1017 సూక్తాలు = 2006 వర్గాలు =10580 ఋక్కులుగా విభజన జరిగింది.

ఈ పుస్తకంలో మండలం, అనువాకం, సూక్తం పద్ధతినే అనుసరించబడింది.

- రచయితలు -

పి.వి. రాఘవరావు

పి.వి. గోపాలరావు

ఇంద్రుడు అనగా ఎవరు?

పురాణాల ప్రకారం స్వర్గానికి అధిపతి, దేవతలకు రాజు ఇంద్రుడు. అసలు "స్వర్గం ఎక్కడ వుంది? ఎలా వుంటుంది?" అనే ప్రశ్నలకు జవాబు చెప్పటానికి నిజంగా స్వర్గం చూసి వచ్చిన వారెవరూ లేరు. కానీ పురాణాలలోని వర్ణనల ఆధారంగా మన సినిమాలలో కృత్రిమంగా స్వర్గం నిర్మించి చూపిస్తుంటారు. అంతవరకే మనం స్వర్గాన్ని చూడగలం. కానీ ఏదైన అద్భుత ప్రదేశాన్ని వర్ణించేటపుడు "అబ్బ స్వర్గంలా వుంది" అంటారు ప్రతివారు. కానీ నిజం స్వర్గం యెక్కడ వుందో కూడా తెలియదు. అసలు ఈ స్వర్గం యెక్కడ వుంది? అనే అంశం మన దేశస్తులకే కాదు విదేశీయులకీ ఆసక్తి కలిగించింది. ఎందరో విదేశీయులు దాని గూర్చి పరిశోధనలు చేశారు.

"మేరు పర్వతమే స్వర్గం" అని కొందరు అభిప్రాయపడ్డారు. స్వర్గం భూమి మీదనే వుందని కొందరు చెబితే, ఆకాశంలో వుంటుందని మరికొందరు వాదించారు. మరికొందరు మరేదో గ్రహంపై స్వర్గం వుండవచ్చునన్నారు.

మన భారత శాస్త్రవేత్తలు కొందరు యురేనస్ గ్రహానికి ఇంద్రగ్రహం అని పేరు పెట్టారు కనుక అదే స్వర్గం అయి వుంటుందని మరికొందరి అభిప్రాయం.

అయితే యివేవీ నిజం కాదని చెప్పవచ్చు. ఎందుకంటే...... మేరుపర్వతం అంటే బంగారుకొండ. శివుడి ప్రధమ నివాసస్థలం దానిని కుబేరుడికి దానం చేసి వెండి కొండ (హిమాలయాలకు)కు శివుడు చేరుకొన్నట్లుగా పురాణాలు చెబుతున్నాయి. కనుక మేరువు స్వర్గం కాదు.

యురేనస్ గ్రహం కనుగొనబడే నాటికి పురాణ కాలమే కాదు. ఇతిహాసకాలం, చరిత్రకాలం కూడా ముగిసిపోయాయి. ఇక పురాణాలలో ఈ గ్రహప్రసక్తి ఎలా వుంటుంది? సరియైన వెలుతురే లేని యురేనస్ వెలుగు జిలుగుల స్వర్గం ఎలా అవుతుంది? యురేనస్ స్వర్గం కాదు.

స్వర్గం భూమి మీదే వుంటే త్రిశంఖుడిని రోదసీనౌకలో ఆకాశంలోకి విశ్వామిత్రుడెందుకు పంపించాలి? అందువలన స్వర్గం భూమిపైన లేదు అని తెలుస్తుంది. అలాగే అనేక పుస్తకాలలో మనం చదువుతుంటాం.... "దివి.... భువి" అని. అంటే భూమి వేరు, స్వర్గం వేరు అని తెలుస్తుంది. మరియు "దివి" అంటే ఆకాశం అని కూడా అర్థం వుంది కదా! అందువలన ఆకాశమే స్వర్గమా? అనిపిస్తుంది. నిజమే మన గ్రంధాలలోని కొన్ని అంశాల ఆధారంగా చూస్తే ఆకాశమే స్వర్గం. నక్షత్రాలే దేవతలు అని కూడా అనిపిస్తుంది.

దేవతలను గూర్చి ఋగ్వేదం ఏం చెప్పిందో చూద్దాం. ఋగ్వేదం 5-17-3 లో "దివో న యస్య రేతసా బృహ చ్ఛోచన్త్యర్చయ" అనే మంత్రానికి అర్థం ఆకాశంలోని యీ నక్షత్రాలకు యీ కాంతి, శక్తి ఎలా వచ్చాయి? అవి దేవతల స్వరూపాలు కనుక".

అలాగే ఋగ్వేదం 10-55-3 ఋక్కులో

"ఆ రోదసీ అవృణాదోతమధ్యం పంచదేవానాం ఋతశం:
సప్తసప్త చతుస్త్రింశతా పురుదావిచేస్టే సరూపేణా జోతిషా విప్రతేన"
అని వుంది. దాని అర్థం – "ఈ భూమ్యాకాశాల మధ్యలో దేవతలను తారా రూపాలలో ఇంద్రుడే నిలిపియున్నాడు".

స్వర్గమనే ఆకాశంలో దేవతలే నక్షత్రాల రూపంలో వున్నారనటానికి యీ ఋగ్వేద మంత్రాలు ఋజువులుగా నిలుస్తున్నాయి కదా! అంటే.. నక్షత్రాలకు దేవతలు, ఋషులు, పతివ్రతలు, మహనీయులు అధి దేవతలుగా వుంటారని అర్థం.

దేవతలను గుర్తించాం. మరి ఇంద్రుడు యెవరు? దేనికి అధిదేవుడు? చూద్దాం దీనికి మన గ్రంధాలు చెప్పిన ఋజువులేమిటో చూద్దాం. అది చూసే ముందు మరో చిన్న పాఠం చెప్పుకోవాలి మనం.

✤ ✤ ✤


విష్వచ్చలనం

భూగోళం తన చుట్టు తాను తిరుగుతుందని, అందువల్లనే రాత్రి పగలు ఏర్పడుతాయనీ అందరికీ తెలుసు. అలాగే సూర్యుని చుట్టూ తిరుగుతుందనీ అందువల్ల కాలాలు ఏర్పడుతాయనీ తెలుసు. ఈ రెండు రకాల చలనాలే కాక భూగోళానికి మరో చలనం వుంది. అదే విష్వచ్చలనం. దీని వల్ల ఋతువులు ఏర్పడుతాయి. విష్వచ్చలనం అంటే.... భూగోళం 23 $1/2^0$ ఒక ప్రక్కకి ఒరిగి వుంటుంది కదా! అనగా భూమి యొక్క ఉత్తర ధృవపు ఇరుసు తిన్నగా వుండకుండా ప్రక్కకు ఒరిగి వుంటుంది.


క్రింది వున్న బొమ్మ చూశారా? భూగోళం ఒక ప్రక్క ఒరిగి తిరుగుతుంటుందని మనందరికీ తెలుసు. భూమి ఉత్తర ధృవంకి తిన్నగా ఏ నక్షత్రం వుంటుందో దాన్ని ధృవతార అంటారు. ఎల్లకాలం ఒకే నక్షత్రం ధృవతారగా వుండదు. ఎందుకంటే భూమి యొక్క విష్వచ్చలనం వలన

కొన్ని వేల యేళ్ళకు ఒక నక్షత్రం వైపు ఉత్తర ధృవం వుండేలా తిరుగుతుంది. భూమి ఉత్తర ధృవం ఏ కాలంలో ఏ తారవైపు తిన్నగా వుంటుందో ఆ తార ధృవతార అవుతుంది. అందువల్ల సుమారు 2000 ఏళ్ళకు ధృవతార మారిపోతుంటుంది.


ధృవతార నుండి మొదలుపెట్టి ఆకాశాన్ని తూర్పుభాగం, పశ్చిమ భాగంగా రెండు భాగాలుగా విడదీస్తూ, ఒక రేఖను గీస్తే అది ఆకాశాన్ని చుట్టి వచ్చి మరల ధృవతారను చేరుకుంటుంది కదా. ఆ రేఖనే విష్వద్రేఖ అంటారు. భూమి ఉత్తర అక్షం కేవలం ధృవతారా చక్రం చుట్టూ వున్న తారలకు తిన్నగా వుండే విధంగానే తిరుగుతుంది. అందువల్ల ధృవతారా చక్రం దరిదాపులలో వుండే తారలే ఒకదాని తరువాత మరొకటి ధృవతార అవుతుంది.



బూమి ఎల్లకాలమూ ఒకే దిశగా ఒరిగి వుండదు. అదికూడా రౌండ్లు వేస్తూ తిరుగుతుంటుంది.



ఎందుకంటే భూగోళం ఎంతో వేగంగా తిరుగుతుంది కదా! అందువల్లనే అలా ఒకవైపుకు ఒరిగిపోయి ఎల్లకాలం ఒకే దిశ వైపు ఒరిగి వుండకుండా దిశ మార్చుకుంటూ మెల్లగా రౌండ్లు వేస్తూ వుంటుంది. ఇప్పుడు భూమి ఉత్తర ధృవపు ఇరుసు ఒక నక్షత్రం దిశగా ఒరిగి వుందనుకొండి. కాలక్రమేణా దిశ మార్చుకోవటం వలన ఉత్తర ఇరుసు మరో నక్షత్ర దిశకు... ఆ తదుపరి మరో తార అలా... తిరిగి మొదటి నక్షత్రంకి తిన్నగా ఉత్తర ఇరుసు చేరటంతో ఒక రౌండు పూర్తవుతుంది. అలా ఒక రౌండు పూర్తి చేయటానికి సుమారు 25800 సంవత్సరాలు పడుతుంది. అలా తిరగటాన్నే విష్వచ్ఛలనం అంటారు. ఈ విషయం బాగా అర్థం కావాలంటే గుక్కపట్టి తిరిగే బొంగరాన్ని పరిశీలించండి.



ఈ విధంగా భూమి ఒరిగి వుండటం వల్ల ఋతువులు ఏర్పడతాయి. ఈ విష్వచ్ఛలనం వల్ల కొన్ని వందల సంవత్సరాలకు ఋతువుల ఆరంభకాలాలు మారిపోతుంటాయి. (సుమారు 2000 సం॥కి ఒక నెల చొప్పున ఋతు ఆరంభకాలం ముందుకు జరిగిపోతుంది.)


ఆ మార్పులను లెక్కించేందుకు మన ఋషులు ఒక పద్ధతిని కనుగొన్నారు. ఆ విధంగా "విష్వద్రేఖ" ఏర్పడింది.

✣ ✣ ✣

విష్వద్రేఖ (CELISTIAL EQUATOR)

భూమి ఉత్తర ధృవపు ఇరుసు ఆకాశంలోని ఏ నక్షత్రానికి సూటిగా వుంటుందో ఆ నక్షత్రాన్ని ధృవతార అంటారు. కాలక్రమేణా భూమి ఉత్తర ఇరుసు దిశ మారుతుండటం వలన సుమారు 2000 ఏళ్ళకొక ధృవతార మారిపోతూ వుంటుంది. ఆ విషయం అర్థం కావాలంటే యీ క్రింది బొమ్మను పరిశీలించండి.

ధృవతారా చక్రం



ప్రస్తుతం క్రీ.శ. 2000 ప్రాంతం కనుక భూమి ఇరుసు నేటి ధృవతార పేరు "ఔత్తానపాది" (ఉత్తానపాదుడి కుమారుడైన ధృవకుమారుడు) ధృవతారకు తిన్నగా వుంది. క్రీ.శ. 5000 నాటికి భూమి ఇరుసు దిశ మారిపోయి సెఫియస్‌లో మొదటి తార తిన్నగా వుంటుంది. అనగా క్రీ.శ. 5000 ప్రాంతంలో అదే ధృవతార అవుతుంది. క్రీ.శ. 8000 నాటికి భూమి ఇరుసు మరింతగా జరిగి సెఫియస్ రెండవ తారకు తిన్నగా వెళ్తుంది. ఆ కాలంలో అదే ధృవతార అవుతుంది. అదే విధంగా క్రీ.శ. 12000 నాడు సిగ్నస్‌లోని ఒక తార ధృవతార అవుతుంది. క్రీ.శ. 14000 నాటికి లైరా రాశిలోని అభిజిత్తు ధృవతార అవుతుంది. క్రీ.శ. 16000 నాటికి హెర్కులిస్ రాశిలోని మొదటి తార మరియు క్రీ.శ. 19000 నాటికి హెర్కులిస్‌లోని రెండవ తార ధృవతారలవుతాయి. ఈ తదుపరి క్రీ.శ.

22000 నాటికి డ్రాకో రాశి చివరిలో గల "తూబా" నక్షత్రమే ధృవతార అవుతుంది. (ఈ "తూబా" క్రీ.పూ. 3000లో ధృవతారగా వుండేది) అలాగే ఈనాటి మన ధృవతార సుమారు క్రీ.శ. 26000 ప్రాంతంలో మరల ధృవతార స్థానంలోకి వస్తుంది.

ఈ విధంగా భూమి ఉత్తర ఇరుసు రౌండ్లు వేస్తుంది. దీనిని 'ధృవతారా చక్రం" అంటాం. భూమి ఉత్తర ఇరుసు గురి ధృవతారా వృత్తం మీదనే తిరుగుతూ వుంటుంది.

ఈ విషయాన్ని కనుగొన్న మన ప్రాచీన ఋషులు ఈ ధృవతారల ఆధారంగా "విష్వద్రేఖ" అనే వూహారేఖను గీయటం ఆరంభాంచారు. అనగా ధృవతార నుండి మొదలుపెట్టి ఆకాశం మధ్యగా ద్వాదశరాశి చక్రం మీదుగా దక్షిణ దిశను తాకుతూ అలా కొనసాగి ఒక రౌండు పూర్తి చేస్తూ తిరిగి ధృవతారను చేరుకునే విధంగా వూహారేఖను గీశారు. భూగోళం మధ్యగా భూమధ్యరేఖ అనే వూహారేఖ ఏలా ఏర్పరచారో అలాగే ఖగోళాన్ని (ఆకాశం) తూర్పు భాగం, పడమర భాగం అనే రెండు భాగాలుగా విభజిస్తూ ధృవతార ఆధారంగా ఉత్తర దక్షిణాలను కలిపే రింగు వంటి వూహారేఖయే ఖగోళ మధ్యరేఖ అనబడే విష్వద్రేఖను ఏర్పరచారు.

ఈ విష్వద్రేఖకి అధిదేవుడు ఇంద్రుడని గుర్తించారు. ఋషులు. ఎందుకంటే ధృవతారల మార్పుల మూలంగా ఈ విష్వద్రేఖ అంతకంతకూ ప్రక్కకు జరిగిపోతూ 25800 సంవత్సరాలలో మొత్తం ఆకాశంలోని అణువణువునూ తాకుతూ, ఆకాశంలోని దేవతా స్వరూపాలయిన నక్షత్రాలన్నింటినీ పరిపాలిస్తూ (స్పృశిస్తూ) ఒక రౌండు చేస్తుంది.

"ఇయానః కృష్ణే దశభిం సహస్రై అవత మింద్రః" అనే ఋగ్వేద మంత్రానికి అర్థం...... "ఒక కల్పక కాలంలో ఇంద్రుడు 150000 సార్లు తిరుగుచున్నాడు.

ఒక కల్పకమునకు 4320000000 సంవత్సరములు. కల్పకంలో 150000 సార్లు తిరుగుతాడు కనుక 4320000000÷150000= 28800 కనుక ఒక మారు తిరుగుటకు 28800 సంవత్సరములు పట్టును.

నేటి ఆధునిక శాస్త్రజ్ఞుల లెక్కప్రకారం విష్వద్రేఖ ఒకసారి తిరుగుటకు 25800 సం॥ పట్టును. ఋగ్వేద ఋషుల లెక్క ప్రకారం 28800 సం॥ పట్టును అని వుంది. ఈ రెండు లెక్కలకు 3000 సం॥ తేడా వస్తుంది. ఎందువలన? అంటే విష్వచ్ఛలన వేగం 46 సెకండులని వేదఋషులు చెప్పగా నేటివారు విష్వచ్ఛలన వేగం 50 సెంకడులని చెపుతున్నారు. ఆ విధంగా రెండు వేగాలకు 4 సెకండులు తేడా వున్నందున పైన చెప్పిన 3000 సం॥ తేడా కనిపిస్తుంది. దానికి కారణం వేద కాలానికి, ఈనాటికి విష్వచ్ఛలన వేగంలో మార్పు కలిగి వుండవచ్చు లేదా ఆ వేగాన్ని లెక్క కట్టడంలో కొద్ది పొరపాటు జరిగివుండవచ్చు. ఏది ఏమైన ఈ విశ్వచ్ఛలన రహస్యం ఏనాడో మన వేద ఋషులకు తెలుసు అనేది నిజం. (ఈ వివరాలకోసం "విజ్ఞాన సర్వస్వం నెం. 7 గ్రంథంలో చూడండి.)

ఈ విధంగా ఒక కల్పక కాలంలో 150000 మార్లు తిరిగేది ఇంద్రుడని ఋగ్వేదం, విష్వద్రేఖయని మన విజ్ఞాన గ్రంథాలు చెబుతున్నాయి. కనుక ఈ విష్వద్రేఖాధి దేవుడు ఇంద్రుడు అని అర్థమవుతుంది కదా!

ఈ రేఖ వలన మనకు కలిగే లాభం ఏమిటంటే?

మన మామూలు గడియారంలో 12 గంటల పరిమితి వుంటుంది. కొన్ని గడియారాలలో 24 గంటల పరిమితి వుంటుంది. మనం టైము ఎంత అయిందో తెలుసుకునేందుకు ఆ అంకెల మీదుగా తిరుగుతూ రౌండ్లు పూర్తి చేసేందుకు పెద్దముల్లు, చిన్నముల్లు ఉంటాయి కదా! అలాగే ఆకాశం

అనే గడియారంలో విష్వద్రేఖ అనే ఒకే ఒక పెద్ద ముల్లు వుంది. ఆ ముల్లు 25800 సం॥ల కాలాన్ని సూచిస్తుందని అన్నారు బాల గంగాధర్ తిలక్ గారు.

మన గడియారాలలో ముల్లులు వున్న స్థానాల ఆధారంగా మనం టైము ఎంత అయిందో తెలుసుకోగలం. అలాగే ఖగోళంలో విష్వద్రేఖ వున్న స్థానం ఆధారంగా అది ఏ కాలం? ఎంత ప్రాచీన కాలం అనే విషయాన్ని మనం తెలుసుకోవచ్చు.

పూర్వకాలంలో జరిగిన గాధల గూర్చి తెలియజేసేందుకు ఆ కథలలో విష్వద్రేఖాధి దేవుడైన ఇంద్రుని పాత్రను యిరికించి వ్రాసేవారు మన ప్రాచీన ఋషులు. అనగా ఆ కాలంలో విష్వద్రేఖ ఏ నక్షత్రాల వద్ద వుందో ఆ నక్షత్రాలు+ఇంద్రుడు+ ఆకాలంలో జరిగిన విశేషము అన్నీ కలసి ఒక గాధను గూర్చి వేదాల్లో, పురాణేతిహాసాల్లో చేర్చేవారు.

అలాంటి కథల వలన ఇంద్రుడు ఆ కథలో ఏ నక్షత్రాలతో కలిసివున్నాడో ఆ నక్షత్రాల వద్ద విష్వద్రేఖ వుందని గుర్తించవచ్చు. దాని వలన ఆ కథ ఎంత ప్రాచీన కాలంలో జరిగిందో కూడా తెలుసుకోవచ్చు అలాంటి ఉదాహరణలు ముందు ముందు చూద్దాం. ముందుగా విష్వద్రేఖాధి దేవుడు ఇంద్రుడే అనేందుకు ఇంకా కొన్ని వేద విషయాలను పరిశీలిద్దాం.

వేద వాక్యం	అంతరార్థం
1. ఇంద్రుడు అంతరిక్షంలో దేవుడు	1. ఇంద్రుడు ఆకాశంలో వుంటాడని ఈ వేద మంత్రార్థం కదా! (కానీ ఒక నాస్తిక రచయిత తన గ్రంథంలో ఇంద్రుడు భూమి మీద

	నివశించిన ఒక దారి దోపిడిగాడు అంటూ.... అనేక విధాల నిందించడం చాలా మూర్ఖత్వం కదా!) విష్వద్రేఖ అనగా ఖగోళ మధ్య రేఖ కదా! ఆకాశంలోనే వుంటుంది.
2. 100 భూములు కలిసినా ఇంద్రునితో సమానం కావు. అంత పెద్ద శరీరుడు యింత వరకు పుట్టియుండలేదు. ఇక ముందు పుట్టబోడు. కానీ శ్రీమహా విష్ణువు ఒక్కడే ఇతని కన్న పెద్ద శరీరుడు.	2. విష్వద్రేఖ అనగా మొత్తం ఖగోళాన్ని చుట్టుకుని వుండే వడ్డాణం వంటి రింగు కదా మరి అంత పెద్ద ఆకారం మరిదేనికీ వుండదు. ఎన్ని భూగోళాలు నక్షత్రాలు కలసినా విష్వద్రేఖతో సమానం కాలేవు. కానీ శ్రీమహావిష్ణువు అంటే... ఈ సమస్త విశ్వమూ ఆయనే కదా!
3. ఇంద్రుని శరీం నిండా కళ్ళు వుంటాయి	3. కళ్ళు అంటే నిజంగా కళ్ళు కాదు. ఆకాశంలో విష్వద్రేఖ పొడవునా వ్యాపించి వుండే నక్షత్రాలనే మిల మిల మెరిసే కళ్ళు అని చమత్కరించారు.
4. యజ్ఞాలకు అధిదేవుడు ఇంద్రుడు	4. యజ్ఞం అనగా సంవత్సరం అనీ అర్థం వుంది. "సంవత్సరం" కాలమానంలో ముఖ్య భాగం.

	ప్రాచీన కాల లెక్కలకు విష్వద్రేఖ చాలా ఉపకరిస్తుందని దీని భావం.
5. దేవతలను పరిపాలించువాడు ఇంద్రుడు.	5. నక్షత్ర రూపాలలో వున్న దేవతలను స్పృశిస్తూ (మొత్తం నక్షత్రాలన్నింటి మీదుగా పయనిస్తూ) రౌండ్లు వేసేది విష్వద్రేఖయే కదా!

ఈ విధంగా వేద, పురాణాలు ఎన్నో విధాల ఇంద్రుని గూర్చి చేసిన వర్ణనలు విష్వద్రేఖనే తలపింపచేస్తున్నాయి.

దేవతల గురించి ఋగ్వేదంలో.... మొత్తం 3339 మంది దేవతలు అని చెబుతూ అందులో 3000 మంది దేవతలనీ, మిగిలిన 339 మంది దేవతా సమానులైన అప్సరసలు, ఋషులు, ఇతర మహనీయులు మొత్తం 3339 మంది దివిలో వెలుగుతుంటారని వ్రాయబడింది. నేటి ఆధునిక శాస్త్రవేత్తలు మన మామూలు కంటికి కనిపించే నక్షత్రాలను అతి సూక్ష్మంగా లెక్కిస్తే ఇంచుమించు 3000 వుంటాయని తేల్చి చెప్పారు. వారి లెక్క మన ఋగ్వేద ఋషుల లెక్కతో సరిపోయింది కదా!

✣ ✣ ✣

<u>సూచన :</u> దేవతల సంఖ్య చెప్పవలసినప్పుడు ముక్కోటిదేవతలు అంటాం. ఎందుకంటే ఆకాశంలో కోట్లాది నక్షత్రాలుంటాయని చెప్పటమే దాని భావం. కానీ ఆధునిక శాస్త్రజ్ఞులు మామూలు కంటికి కన్పించే తారలను ఎంత నిశితంగా లెక్కించినా 3000 ఉంటాయని సిద్ధాంతం చేశారు. అదే సిద్ధాంతాన్ని మన పూర్వఋషులు ముందే గమనించారు. అందుకే సందర్భానుసారంగా ఒకచోట 3339 అనీ సాధారణంగా ముక్కోటి దేవతలనీ మన గ్రంధాల్లో వ్రాయబడింది.

విష్వద్రేఖను యెవరు కనుగొన్నారు?

మన ప్రాచీన ఋషుల ఖగోళ శాస్త్ర ప్రతిభను ముందుగా గుర్తించింది విదేశీయులే. కానీ తమ కంటే హిందువులే ప్రాచీన మేధావులనే నిజాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. అందుకని ఎన్నో మాయోపాయాలతో మన ప్రాచీన చరిత్రను నవీనం అనిపించటానికెన్నో పాట్లు పడ్డారు. ఎన్నో దొంగ సాక్షాలతో మన భారతీయులనే నమ్మించేశారు.అలా వారు ఎన్నో దొంగ మార్పులతో ఈ భూమిపై గల నిజమైన సాక్షాలను దాచగలిగారు. కానీ ఆకాశంలోని గల మహాగడియారాన్ని, అది చెప్పే ఋజువులను మార్చలేరు కదా!

మన ప్రాచీన హిందువులు అంత గొప్ప విజ్ఞానం సాధించినట్లయితే... దానిని ప్రత్యక్షంగా విజ్ఞాన గ్రంధాలుగా వ్రాయకుండా వేద, పురాణ పరిభాషల్లో వ్రాయటం యేమి విజ్ఞత? అని ఒక భారతీయ మేధావి విమర్శించారు. కానీ అలా వేద, పురాణ రూపాల్లో వున్నందు వల్లనే ఈ నాటికీ ఆ ఋజువులు మిగిలి వున్నాయి. లేకుంటే వాటిని కూడా విదేశీ స్వార్థపరులు మార్పులు చేసేసి నవీన కాల విషయాలుగా రూపొందించే వారే. ఆర్యభట్టు, భాస్కరుడు, వరాహ మిహిరాది భారత విజ్ఞానులు తమ పరిశోధనా ఫలితాలను విజ్ఞాన గ్రంధాలుగానే వ్రాశారు. అందుకే వారి జీవన కాలాలను మాయ ఋజువులతో నవీన కాలాలుగా రూపొందించి మన భారతీయుల చేతనే నమ్మించేశారు కదా! వేద, పురాణాలే మన ప్రాచీన విజ్ఞాన శాస్త్రాలనే విషయం మరువకండి.

అతి ప్రాచీన కాలంలో కాలమానం లెక్కవేయటానికి చాలా ప్రయాసలు పడేవారు. మూడు కాలాలలో స్పష్టంగా తెలిసే కాలం వర్షాకాలం. కనుక ఆదిలో మన ఋషులు ఒక వర్షకాలం నుండి తదుపరి వర్షాకాలం వచ్చే

వరకు ఒక సంవత్సరంగా లెక్కవేసేవారు. అందువల్లనే "సంవత్సరం" అనే మాటగకు "వర్షం" అనే పర్యాయ పదం వచ్చింది. ఈనాటికీ కొన్ని సందార్భలలో సంవత్సరం అనటానికి "వర్షం" అని అంటున్నాం. అందువల్లనే వేదాలలో వరుణదేవుడికి ప్రాధాన్యతనిస్తూ అనేక సూక్తాలు రచించబడ్డాయి. కానీ కొంతకాలం తరువాత ఈ వర్షాల లెక్క ఖచ్చితంగా లేకపోవటంతో కొంచం పద్ధతి మారింది. వర్షాధార కాలమానంతో పాటు, చంద్రుడి నడకలు, చంద్రకళలు ఆధారంగా లెక్క ప్రారంభించారు. అందుకోసం అనువుగా వుంటుందని రోజుకొక యజ్ఞం చొప్పున చేసేవారు. లెక్కప్రకారం యజ్ఞాలన్నీ పూర్తయే సరికి సంవత్సరం పూర్తవుతుంది. ఆ రోజులలోనే "సంవత్సరం" అనే మాటకు "యజ్ఞం" అని కూడా పేరు వచ్చింది.

అయినా తృప్తికరంగా కాలమానం సాగటంలేదు. చాంద్రమానానికి, ఋతుమానానికి తేడా వస్తుంది. ఋతువులు ఆరంభ కాలాలు మారిపోవగటం గమనించారు. అలా ఎందుకు మారుతున్నాయి? అనే పరిశోధనలో ధృవతారలు మారిపోతున్నట్లు గుర్తించారు. అపుడు క్షుణ్ణంగా ధృవతారలపై పరిశోధన చేశారు. ధృవతార ఆధారంగా కాలమానం రచించాలనిపించింది. అందుకోసం వీలుగా వుండటం కోసం ధృవతార ఆధారంగా విష్వద్రేఖ గీయటం కనుగొన్నారు. విష్వద్రేఖ ఏ నక్షత్రం (ముఖ్యమైన తార) మీద వుందో ఆ నక్షత్రంతో సూర్యుడు ఉదయించే రోజున సంవత్సరం ఆరంభించటం మొదలుపెట్టారు. దాన్నే సూర్య సహోదయ పద్ధతి అని కూటా అంటారు.

ఈ పద్ధతి వచ్చినా యజ్ఞాలు చేసే పద్ధతి మానలేదు. చాంద్రమానం ప్రకారం యజ్ఞాలు చేస్తూ సౌరమానంతో సరివుచ్చుటానికి ప్రత్యేక యజ్ఞాలు చేస్తూ కాలమానం లెక్కించేవారు.

వర్షాధార కాలమానం పోయి విష్వద్రేఖ వద్ద సూర్యోదయంతో కాలమానం లెక్క రావటంతో వేదాలలో వరుణిడి ప్రభావం తగ్గిపోయి, ఇంద్రుడి ప్రభావం, ఇంద్రుడి సూక్తాలు హెచ్చుగా వచ్చాయి.

విష్వద్రేఖాచలనం వల్లనే ఋతువులు మారుతున్నాయి. కనుక వర్షాలకు, వరుణుడికి కూడా ఇంద్రుడే నాయకుడయ్యాడు. అలాగే విష్వద్రేఖ వద్ద సూర్యోదయంతో కాలమాన యజ్ఞాలు చేయటం వలన యజ్ఞానికి ఇంద్రుడే అధిపతి అయ్యాడు. ఆకాశం అంతా పనయనించే వాడు కనుక దేవతలకు అధిపతయ్యాడు. ఆ విధంగా విష్వద్రేఖ.... ఏర్పడింది.

భూమి యొక్క విష్వచ్ఛలనాన్ని అనుసరించి విష్వద్రేఖచలనం వుంటుంది. విష్వద్రేఖ ఆధారంగా ఋతు మార్పులు, సంవత్సరాది మార్పులు, కాలమానం తెలుసుకోవచ్చు మరియు ఈ విష్వద్రేఖ ఆధారంగా ప్రాచీన పురాణగాధలు ఎంత ప్రాచీన కాలంలో జరిగాయో కూడా తెలుసుకోవచ్చు.

విష్వచ్ఛలనం, విష్వద్రేఖలను మొట్టమొదటిగా క్రీ.పూ. 125లో హిప్పార్చస్ అనే గ్రీకు శాస్త్రవేత్త కనుగొన్నాడని పాశ్చాత్యులు వాదిస్తారు. దానిని మన భారతీయులు కూడా చాలా మంది నమ్మేస్తున్నారు. కానీ ఆ అద్భుత విషయాలను మన హిందూ ఋషులు అనేక వేల యేళ్ళకు ముందే కనుగొన్నారనేది మా వాదం. దానికి అనేక శాస్త్ర ఋజువులను ముందు ముందు పరిశీలిద్దాం.

ఒక్కసారి ధృవతారా చక్రం బొమ్మను పరిశీలించండి. ఒక్కొక్క ధృవతార సుమారుగా రెండు వేల సంవత్సరాలు ధృవస్థానంలో వుంటుంది. అలా వృత్తరేఖకి దగ్గరగా వున్న ఎనిమిది తారలు మాత్రమే ధృవతారలుగా వుండే అవకాశం వుంది. అలా ధృవతార సరిగా వున్న కాలంలో ఆ తార

ఆధారంగా విష్వద్రేఖను సులభంగా గీయవచ్చు. కానీ ధృవతారకూ, ధృవతారకు మధ్యలో చాలా ఖాళీ ప్రదేశాలున్నాయి కదా! భూమి ఉత్తర అక్షం ఆ ఖాళీ ప్రదేశానికి తిన్నగా వుండే కాలంలో విష్వద్రేఖను గీయటం ఎలా?

అది ఒక సమస్య అయింది ఋషులకు. ఆలోచించి ఆలోచించి చివరికి ఒక ఏర్పాటు చేశారు.

✣ ✣ ✣

ఇంద్ర పదవి

భూమి ఇరుసు ఏదైనా ఒక తారకు తిన్నగా వుంటే ఏ సమస్య వుండదు. అదే ధృవతార అవుతుంది. కనుక దాని ఆధారంగా విష్వద్రేఖ గీసేస్తారు. అలా కాకుండా సూన్య ప్రదేశానికి తిన్నగా భూమి ఇరుసు వుండే కాలంలో.... ధృవతారా వృత్తానికి కాస్త దూరంగా వున్నా సరే యించుమించుగా సరిపోయే మరో తార ఏదో ఒక దానిని ఉపతారగా గుర్తించి దాని ఆధారంగా విష్వద్రేఖ గీయటం మొదలెట్టారు. (ధృవతార వృత్తరేఖకు వీలైనంత దగ్గరగా వుండాలి. భూ ఉత్తర అక్షంకి తిన్నగా వున్న స్థలంనుండి గీసే విష్వద్రేఖచే ఖండించబడాలి. అలాంటి తార ఖచ్చితమైన ధృవతార కాకున్నా ఉపధృవతారగా నిర్ణయించారు)

అసలు ధృవతార ఆధారంగా ఖచ్చితమైన విష్వద్రేఖ గీయవచ్చు. కనుక ఆ కాలంలో సాక్షాత్తు ఇంద్రుడే ఇంద్ర సింహాసంపై కూర్చుని స్వర్గాన్ని పాలిస్తున్నట్లుగా లెక్కించేవారు. అలా కాకుండా ధృవతారకు – ధృవతారకూ మధ్య శూన్య ప్రదేశానికి తిన్నగా భూ అక్షం వున్నపుడు దగ్గర్లో వున్న మరో ఉపతారతో విష్వద్రేఖ గీస్తారు కదా! ఆ కాలంలో ఇంద్రుడు ఇంద్ర పదవి కోల్పోయి, అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడనీ, ఇంద్రుడు లేకుంటే స్వర్గాన్ని

పాలించేవారు లేక అరాచకం వస్తుందనీ, అందుకోసం మరో తాత్కాలిక ఇంద్రుడిని తెచ్చి ఇంద్ర పదవిలో నిలిపారనీ పురాణ కథలు ఏర్పరచారు. భూమిపై నివసిస్తూ నూరు అశ్వమేధాలు చేసిన వారు గానీ, మంచి కార్యాలు చేసి వరాలు పొందిన గొప్ప మహానుభావులు గానీ తాత్కాలిక ఇంద్రుడిగా పదవినలంకరించేందుకు అర్హులు అని పురాణాలు చెబుతున్నాయి.

మరల భూమి విష్వచ్ఛలనం వలన భూ అక్షం దిశమారి ఏదైనా ధృవతారకు తిన్నగా వచ్చినపుడు తాత్కాలిక ఇంద్రుడు పదభ్రష్టుడై అసలు ఇంద్రుడు పదవిలోకి వచ్చినట్లు మరో పురాణగాధ ఏర్పడుతుంది. ఈ విషయం "నహుష చరిత్ర"లో మనకు బాగా అర్థమవుతుంది.

అసలు ధృవతారలు :

1. తూబా (ఇది క్రీ.పూ. 3000 ప్రాంతపు ధృవతార)
2. ధృవుడు (ప్రస్తుత ధృవతార)
3. సెఫియన్ 1వ తార (క్రీ.శ. 5000 ప్రాంతంలో ధృవతార)
4. సెఫియన్ 2వ తార (క్రీ.శ. 8000)
5. సిగ్నస్‌లో తార (క్రీ.శ. 12000)
6. అభిజిత్తు (క్రీ.శ. 14000)
7. హెర్కులిస్ 1వ తార (క్రీ.శ. 16000) దీని పేరే "అహల్య"
8. హెర్కులిస్ 2వ తార (క్రీ.శ. 19000)

మరల క్రీ.శ. 23000 ప్రాంతానికి "తూబా" ధృవతార అవుతుంది.

ఉప ధృవతారలు :

ఇంద్రుడు అజ్ఞాతంలో వున్న సమయంలో తాత్కాలిక ఇంద్రుడుగా నహుషుడు పరిపాలన చేశాడు. అనగా నహుషుడు అనే తార ఉపధృవతార.

అంటే ఒక రకంగా చెప్పాలంటే ధృవతార స్థానమే ఇంద్రపదవి అని చెప్పవచ్చు. ధృవతార ఆధారంగా గీయబడే విష్వద్రేఖాధిదేవుడు ఇంద్రుడు.

ఇక్కడ మరో మాట కూడా చెప్పాలి. కొన్ని ఇంద్ర కథలు ధృవతార సంబంధం లేకుండానే ఏర్పడ్డాయి. విష్వద్రేఖ ద్వాదశ రాశుల్లో యెక్కడవుందో ఆ రాశులు లేక ఆ నక్షత్రాల ఆధారంగా కూడా ఇంద్రకథలు ఏర్పడ్డాయి.

అలాంటి కథలు పురాణేతి హాసాల్లోనే కాదు వేదాలలో కూడా చాలా వున్నాయి. సంతోషకరమైన విషయం ఏమిటంటే ఈ వేద కథల ఆధారంగా మన హిందూ విజ్ఞాన ప్రాచీనత ఎన్నో వేల యేళ్ళ నాటిదనీ వేరే ఏ దేశం, ఏ జాతీ ఆ ప్రాచీనతని అందుకో లేవని చెప్పవచ్చు. మరి కాస్త విచారించాల్సిన విషయాలు ఏమిటంటే... మనకు ప్రస్తుతం 1 % వేదం మాత్రమే లభిస్తుంది. ఆ కాస్త వేదంతోనే ఇంత ప్రాచీనతను నిరూపించ గలిగినపుడు పూర్తిగా వేదం అంతా లభించి వుంటే ఇంకెంత ప్రాచీనత, హిందు జాతి ఘనత లోకం ముందు ప్రదర్శించగలిగే వారమో కదా!

❖ ❖ ❖

బ్రహ్మజ్ఞానం

విష్వద్రేఖను కనుగొన్నదెవరు?

ఐతరేయ బ్రాహ్మణం 5-16 మరియు తైత్తిరీయ బ్రాహ్మణం 2-7-11-9లో ఒక వింతైన కథ వుంది.

మరుద్దేవతల కోసం అగస్త్యుడు కొన్ని వృషభాలను ప్రోక్షించి పూజించాడు. ఆ వృషభాలను ఇంద్రుడు కాజేశాడు. అందువలన

మరుత్తులు కోపించి ఇంద్రునిపై దాడి చేశారు. అపుడు అగస్త్యుడికి ఇంద్రుడు బ్రహ్మజ్ఞానం ఉపదేశించారు.

(ఇలాంటి కథలను చదివి అర్థం చేసుకోలేకనే కొందరు కువిమర్శకులు ఇంద్రుడిని దొంగ, దోపిడిదారు అని విమర్శించారు.)

అసలు ఈ మరుత్తులు, మిత్రుడు, వరుణుడు.... అందరూ ఇంద్రుడికి అనుచరులే కదా! మరి వారిలో వారికి యుద్ధం ఏమిటి? చూద్దాం...

ఒకానొకపుడు వర్షాకాలం ఆధారంగా సంవత్సరారంభం చేసి, కాలమానం లెక్కించేవారు మన ఋషులు. అందువలన ఆ రోజుల్లో వరుణుడు, మిత్రుడు, మరుత్తులు మంచి వున్నత స్థానంలో చెప్పబడేవారు. కానీ కొంతకాలానికి ఋతువుల ఆరంభ సమయాలు మారిపోవటం వలన వర్షాధార లెక్కతో సంవత్సర దినాల సంఖ్యలో తేడా వచ్చింది. ఎందుకు తేడా వచ్చింది? ఆ "దినాలు" ఏమైపోయాయి? ఆ విధంగా కొన్ని దినాలు లోటు రావటాన్నే కొన్ని పశువులను ఇంద్రుడు కాజేశాడని చమత్కరించారు. (గోవులు, వృషభాలు అనే మాటకు సంవత్సరంలోని దినాలు లేక నక్షత్రాలు లేక నీటి బిందువులు అని అర్థం వచ్చే విధంగా వేద ఋషులు వ్రాశారని మా సులభశైలిలో "వేదాలు" అనే గ్రంథంలో చెప్పుకున్నాం కదా!) ఇపుడు వర్షాధార లెక్కలో కొన్ని దినాలు తక్కువ యెందుకు వచ్చాయని ఋషులు పరిశోధించారు. ఋతుసమయాలు మారటానికి కారణం విష్వచ్ఛలనం అని ముందుగా అగస్త్యుడు కనుగొన్నాడు. విష్వద్రేఖకి అధి దేవుడు ఇంద్రుడు కనుకనే ఆ దినాలను ఇంద్రుడు కాజేశాడని, చమత్కరించాడు. మరియు అప్పటి నుండి విష్వద్రేఖ ఆధారంగా కాలమానం లెక్కిస్తే సంవత్సరం లెక్క సరిపోతుందని గ్రహించాడు. అదే అగస్త్యుడికి ఇంద్రుడు బ్రహ్మజ్ఞానం ఉపదేశించటంలోని అంతరార్థం.

(ఆ రోజులలోనే "ఓ ఇంద్రుడా ఈ వరుణుడు చెప్పే అబద్ధాలను ఛేదించు. ఋతాన్ని క్రమంగా నడిపించు" అనే వేద మంత్రాలు కూడా వ్రాయబడ్డాయి.)

✣ ✣ ✣

ధృవతార విశిష్టత

(వశిష్ఠుడే పురోషితుడు)

తాండ్య బ్రాహ్మణంలో ఒక విచిత్రమైన కథ వుంది.

పూర్వం ఒకప్పుడు ఋషులందరికీ ఇంద్రుడిని చూడాలనిపించింది. ఎంతో ప్రయత్నించారు కానీ సఫలం కాలేకపోయారు. చివరకు వశిష్ఠుడు "నివహం" అనే సామ మంత్రాలను కనుగొని చదివాడు. అప్పుడు ఇంద్రుడు కనిపించి ఎన్నో రకాల యజ్ఞాలను, వాటిని ఆచరించే విధానాలను ఋషులకు భోదించాడు. అందుకు ఋషులంతా సంతోషించి "వశిష్ఠుడే పురోహితుడు" అని కీర్తించారు.

ఇది కూడా విష్వచ్ఛలన, విష్వద్రేఖల గూర్చి వివరించే కథే.

ఇందులో ఇంద్రుడనగా విష్వద్రేఖ అనీ, యజ్ఞం అనగా సంవత్సరం... లేక కాలమానం అనీ మనం గమనించాలి.

ఇక కథ అంతరార్థం చూద్దాం. పైన చెప్పిన "బ్రహ్మ జ్ఞానం" మరియు ఈ "పశిష్ఠుడే పురోహితుడు" అనే రెండు కథలకు ఒక విధమైన బంధం కనిపిస్తుంది.

మొదటి కథలో వర్షాధార లెక్కకు బదులుగా విష్వచ్ఛలనం వలన కలిగే మార్పుల ఆధారంగా కాలమానం లెక్కించాలని అగస్త్యుడు కనుగొన్నాడు. అయితే ఆ విష్వద్రేఖను ఎలా దర్శించాలి? ఎక్కడ నుండి

ఆ రేఖను గీయాలి? ఆ రేఖ ఎక్కడ ఉంది? అని ఋషులకు సమస్య వచ్చింది. విష్వద్రేఖను కనుగొనే ప్రయత్నం చేసి విఫలమయ్యారు ఋషులు. అదే ఇంద్రుడ్ని చూడాలని ప్రయత్నించి విఫలం కావటంలోని భావం. చివరికి వశిష్ఠుడు ఆ మర్మాన్ని ఛేదించాడు. ధృవతార ఆధారంగా విష్వద్రేఖను గుర్తించే విధానాన్ని కనుగొన్నాడు. దాని సాయంతో సంవత్సరం... కాలమానం లెక్కలను ఏర్పరచుకున్నారు.

ఇంద్రుడు అనేక యజ్ఞ విధానాలను వివరించటంలోని మర్మం అదే. అందుకే అందరూ వశిష్ఠుడ్ని కీర్తించారు.

(విష్వద్రేఖను కనుగొన్నది యెవరు? విష్వచ్ఛలనాన్ని కనుగొన్నది యెవరు? అనగానే నేటి వారు యిచ్చే సమాధానం ... క్రీ.పూ. 150 ప్రాంతంలో "హిప్పార్చస్" అనే గ్రీకు శాస్త్రవేత్త కనుగొన్నాడు అంటారు. కానీ అది చాలా తప్పు. హిప్పార్చస్ కంటే కొన్ని వేల సంవత్సరాలకు ముందే "ఋతువుల మార్పుకు కారణం విష్వచ్ఛలనం అనీ, విష్వచ్ఛలనాన్ని లెక్కించటానికి విష్వద్రేఖ అవసరమనీ కనుగొన్న మానవుడు అగస్త్యుడు. అలాగే విష్వద్రేఖనూ, ఆ రేఖ సహాయంతో కాలమానాన్ని లెక్కించే విధానాలను కనుగొన్న మానవుడు వశిష్ఠుడు అనేందుకు పైన చెప్పిన వేద కథలు ఋజువులుగా నిలిచాయి కదా!)

విష్వద్రేఖను కనుగొన్న వారిని గుర్తించాం. మరి ఆ విష్వద్రేఖ కనుగొనబడిన కాలం-? ఎంత ప్రాచీన కాలంలో గుర్తించబడిందో చెప్పటం కష్టమే.

ఆకాశంలో వృశ్చిక రాశిని గమనించారా? దాని శరీరం మధ్యలో ఎర్రని తార వుంది చూశారా? దాని పేరు జేష్ఠ. మనకు సుపరిచితమైన

తారలలో పెద్ద తార జేష్ఠ. అందుకే దానికి ఆ పేరు పెట్టారు ఋషులు. మరియు నక్షత్రాలకు అధిదేవతలు దేవతలే కదా! అందుకే దేవతల్లో పెద్ద వాడైన ఇంద్రుడు ఈ పెద్ద తార జేష్ఠకు అధిదేవుడని కొందరు ఋషులు గుర్తించారు.

ప్రాచీన కాలంలో విష్వద్రేఖ ఈ జేష్ఠ నక్షత్రం మీదుగా వున్న రోజులలోనే ఈ విష్వద్రేఖ కనుగొనబడి వుంటుందనీ, అందువల్లనే విష్వద్రేఖాధి దేవుడైన ఇంద్రుడు ఈ నక్షత్రానికి కూడా అధి దేవుడయ్యాడని కొందరు పండితుల భావన. అయితే దీనికి సరైన ఋజువులేమి మన వేద పురాణాల్లో ఇంతవరకూ దొరకలేదు. కాలక్రమాన విష్వద్రేఖ జేష్ఠ నుండి జరుగుతూ "అనూరాధ" తారలను దాటి తదుపరి తార అయిన "రాధ" మీదకు చేరింది. (ప్రాచీన కాలంలో వాడబడిన కొన్ని నక్షత్రాల పేర్లు తదుపరి కాలంలో మార్పు జరిగి వాడబడుతున్నాయి. ఉదా: నేడు మనం "పుబ్బ" అని పిలుస్తున్న తార పూర్వపు పేరు "పూరఫల్గుణి" అలాగే ప్రాచీనకాలంలో స్వాతి తరువాత నక్షత్రాలను రాధ, అనూరాధ అని పిలిచేవారు. ఆ రాధ నక్షత్రాన్నే నేడు "విశాఖ" అని అంటున్నాం.) రాధ నక్షత్రంపై చేరిన విష్వద్రేఖ సరిగ్గా రాధ నక్షత్రాన్ని రెండు సమభాగాలుగా విభాగిస్తూ వుండటం వలన ఆ విషయాన్ని తెలియ చేయటం కోసం ఆ తార పేరును "విశాఖ" అని మార్చేశారట. దీనికి కూడా ఖచ్చితమైన ఋజువునిచ్చే పురాణగాధ లేమి లభించలేదు. లభించినట్లయితే జేష్ఠ ఆధారంగా నేటికి 17వేల యేళ్ళు, విశాఖ ఆధారంగా నేటికి 15వేల యేళ్ళు పూర్వం వరకు మన విజ్ఞాన ప్రాచీనత సాగిపోయేది.

✣ ✣ ✣

చిత్ర యుగం

అయితే కనీసం 14000 ఏళ్ళ నాటి విషయాన్ని ఋజువు చేసే వేద కథ ఒకటి తైత్తిరీయ బ్రాహ్మణం 1-1-2లో వుంది.

కాలకంజుల యాగం చేసి స్వర్గాన్ని ఆక్రమించాలని చూశారు రాక్షసులు. అందుకోసం వారు యజ్ఞవేదిక నిర్మిస్తుండగా ఇంద్రుడు మారు వేషంలో వచ్చి "చిత్ర" అనే ఇటుకను వేదిక నిర్మాణంలో వుంచాడు. ఆ వేదిక ఆధారంగా రాక్షసులు స్వర్గం చేరబోతుండగా ఇంద్రుడు చిత్రను లాగివేశాడు. వేదిక కూలిపోయింది. రాక్షసులు పడిపోయారు.

ఈ కథ చాల చిత్రంగానూ, ఇందులో ఇంద్రుడు ఒక మోసగాడిగానూ కన్పిస్తున్నారు కదా! అర్థం పర్థం లేని కథలాగ వుంది కదా! కానీ చాలా అంతరార్థం వుంది యిందులో.

కాలకంజుల యాగం అంటే కాలమానం లెక్కించే యజ్ఞం (యజ్ఞం=సంవత్సరం అని అర్థం వుందని మరువకండి) ఈ కథలో రాక్షసులు అంటే నిజానికి రాక్షసులు కాదు మానవులే. మానవులు కాలమాన లెక్కలు తయారు చేస్తున్నారు. ఆ కాలంలో విష్వద్రేఖ చిత్ర నక్షత్రం మీదుగా వుంది. అదే ఇంద్రుడు చిత్ర అనే ఇటుకను వుంచటంలో అర్థం. (యజ్ఞవేదిక అనగా కాలమాన గణన అని ఇక్కడ అర్థం) చిత్ర నక్షత్రం వద్ద సూర్యోదయం నుండి సంవత్సరారంభం చేస్తూ కాలమానం ఆచరించేవారు మానవులు. కొంత కాలానికి విష్వద్రేఖ జరిగిపోయి చిత్ర నుండి ప్రక్కకు పోయింది. ఇంద్రుడు మరల చిత్రను లాగివేయటంలోని మర్మం యితే. ఫలితంగా యజ్ఞవేదిక కూలిపోయింది. రాక్షసులు పడిపోయారు. అంటే కాలమాన లెక్క తప్పిపోయింది. మానవులు అయోమయంలో పడిపోయారని అర్థం.

అంతే కానీ యజ్ఞవేదిక ఆధారంగా స్వర్గానికి యెవరూ చేరలేరు. ఇంద్రుడు యెలాంటి మోసం చేయనూలేదు.

ఈ కథ సుమారుగా నేటికి 14000 ఏళ్ళ నాటిది అని చెప్పవచ్చు. ఎందుకంటే చిత్ర తారపై విష్వద్రేఖ వున్నకాలం అదే.

అయితే చిత్ర నుండి మారిపోయిన విష్వద్రేఖ ఎక్కడ వుంది. ప్రస్తుతం దేని ఆధారంగా విష్వద్రేఖ ఏర్పడుతుంది? మళ్ళీ పరిశోధనలలో పడ్డారు ఋషులు. ఆ పరిశోధనా ఫలితమే " అభిజిత్ యాగం" కథ.

✤ ✤ ✤

లోకాధిపతి ఇంద్రుడు (అభిజిత్ యాగం)

తాండ్య బ్రాహ్మణం 16-4లో మరో చిత్రమైన కథ వుంది.

ప్రజాపతి సమస్త లోకాలను సృష్టించాడు. కానీ ఆ లోకాలలోని జీవులు తనకు సరైన మర్యాదనీయటం లేదని, ఆ జీవులను సక్రమంగా వుంచటానికి ఒక నాయకుడిని నియమించాలనుకున్నాడు. ఆ లోకాలన్నింటినీ ఒక దండగా గుచ్చి ఇంద్రుని మెడలో వేశాడు. అపుడు ఇంద్రుడు అభిజిత్ యాగం చేసి విశ్వాన్ని జయించి సమస్తలోకాలకు రాజయ్యాడు.

విష్వద్రేఖకు సంబంధించిన, హిందూ ప్రాచీనత ఋజువును చూపే విజ్ఞాన కథ యిది. దీని అంతరార్థన్ని చూద్దాం.

నిజానికి ప్రాణులన్నీ ప్రజాపతికి మర్యాద చూపకపోవటం అనేది కథాకల్పన మాత్రమే.

విష్వద్రేఖ స్థాన చలనం వలన కొన్ని వేల సంవత్సరాల కొకసారి ఋతువుల అరంభ కాలాలు మారిపోతుంటాయి కదా! అందువలన

కాలమానం తేడా వస్తుంది. అలా తేడా వచ్చి కాలమానం అస్తవ్యస్తం కావటాన్నే ప్రజాపతికి లోకాలన్నీ మర్యాదనివ్వటం లేదు అనటంలోని అంతరార్థం. ఆ లోటును సరిదిద్దాలంటే విష్వద్రేఖ ఉన్న క్రొత్త స్థానాన్ని నిర్ధిష్టంగా గుర్తించాలి. విష్వద్రేఖ ఏర్పడటానికి మూలమైన క్రొత్త ధృవతారను గుర్తించాలి. దాని ఆధారంగా ఋతు ఆరంభాలు, కాలమానం నిర్ణయించిగలుగుతారు. దానికోసం ఋషులు చేసిన పరిశోధనలో "అభిజిత్తు" అనే నక్షత్రం ధృవస్థానంలో వున్నట్లుగా గుర్తించారు. అందుకే ఇంద్రుడు అభిజిత్ యాగం చేసినట్లుగా వ్రాశారు. అనగా అభిజిత్ ఆధారంగా ఏర్పడే ఇంద్రరేఖ (విష్వద్రేఖ) పై సూర్యోదయం రోజు నుండి సంవత్సరారంభం చేయాలని అర్థం. యజ్ఞం అనగా సంవత్సరం అనే అర్థం వుంది కదా! అభిజిత్ యజ్ఞం అంటే అభిజిత్ నుండి ఏర్పడిన విష్వద్రేఖ నుండి సంవత్సరారంభం అని అర్థం. లోకాలన్నీ దండ గుచ్చబడి ఇంద్రుడి మెడలో వేయటం అంటే... విష్వద్రేఖ పొడవునా మిలమిలమెరిసే నక్షత్రాలు వుంటాయి కదా! ఆ నక్షత్రాలే లోకాలు. విష్వద్రేఖ చుట్టూ తారలు వుండటమే లోకాలన్నీ దండగా ఇంద్రుడి మెడలో వుంగటం.

అదీ ఈ వేద కథ అంతరార్థం.

అప్పటివరకూ మరో ధృవతార ఆధారంగా వున్న విష్వద్రేఖతో కాలమానం గణించేవారు. కానీ ధృవతార మారింది. అభిజిత్ ధృవతార అయింది. దాని ప్రకారం విష్వద్రేఖ, కాలమానం ఏర్పరచుకున్నారు ఋషులు అనే విజ్ఞానాంశం చెప్పటానికి ఋషులీ కథను వేదంలో చేర్చారు. ఈ విషయం నేటికి 12000 సంవత్సరాల పూర్వం జరిగిందన్న మాట. అనగా మన విజ్ఞానం 13వేల యేళ్ళకు పూర్వం నుండి వుందని నిరూపణ చేసే కథ యిది.

మరికొంత కాలానికి మరల ధృవతార మారిపోయింది. అభిజిత్తు బదులుగా మరో తార ధృవతార అయింది. అపుడు దాని ఆధారంగా విష్వద్రేఖ ఏర్పడింది. ఆ విషయాన్ని గుర్తించిన ఋషులు ఆ వివరాలను తెలిపేందుకు మరో పురాణగాధను మనకి అందించారు.

✣ ✣ ✣

కుమార స్వామి జనన గాధ

కుమార స్వామి జనన గాధ - దానిలోని అంతరార్థం వివరంగా కావలసిన వారు మా "పురాణగాధల్లో సైన్సు అద్భుతాలు" పుస్తకంలో చదవండి. ఆ గాధ వివరం యిక్కడ క్లుప్తంగా చూద్దాం.

కుమార స్వామి జననం కోసం శివ వీర్యంతో అగ్నిదేవుడూ, పార్వతీ దేవి అండంతో స్వాహాదేవి కలిశారు. ఆ సందర్భంలో సప్త ఋషుల భార్యల రూపంలో అగ్నిదేవుని కలసింది స్వాహాదేవి. అయితే స్వాహాదేవి కేవలం ఆరుగురు మునిపత్నుల రూపాలే దాల్చగలిగింది. ఏడవదైన అరుంధతీ రూపం దాల్చలేకపోయింది. ఆ విషయం తెలిసిన సప్త ఋషులలో వశిష్ఠుడు మాత్రం తన భార్య అరుంధతిని స్వీకరించాడు. మిగిలిన ఆరుగురు ఋషులు తమ భార్యలను విడిచిపెట్టి అరుంధతీ, వశిష్ఠులతో సహా ఉత్తర దిశ ఆకాశానికి వెళ్ళిపోయారు. అపుడు ఆ ఆరుగురు మునిపత్నులు ఎంతో విచారించి కుమారస్వామిని శరణుకోరారు. తమను కూడా సప్త ఋషుల ప్రక్కన చేర్చమని అడిగారు. అపుడు కుమారస్వామి ఇంద్రుడిని పిలిచి "అభిజిత్తు తపస్సు చేసుకునేందుకు వెళ్ళిపోయింది. కనుక ఆమె వుండే స్థానం ఖాళీ అయిపోయింది. ఈ ఆరుగురు మునిపత్నులను ఆ ఖాళీ స్థలంలో వుంచు" అని చెప్పాడు. అలాగే అంటూ ఇంద్రుడు ఆరుగురు మునిపత్నులనూ సప్తర్షీ మండలానికి, అభిజిత్తుకు మధ్యస్థానంలో నిలిపాడు. అదీ క్లుప్తంగా పురాణ కథ.

దీని అంతరార్థం చూదాం.

పూర్వకాలంలో కృత్తికా నక్షత్రం చాలా పెద్దదిగా మంచి కాంతితో వెలిగిందట. అందుకే ఆ తారకు స్వాహాదేవియని పేరు పెట్టారు. దానికి అధిదేవుడిగా అగ్నిదేవుని నియమించారు. కొంతకాలానికి అది ప్రేలిపోయి ముక్కముక్కలుగా విడిపోయింది. (నిజానికి వందలాది ముక్కలుగా విడిపోయింది కానీ మన మామూలు కంటికి నేడు 6 ముక్కలే కన్పిస్తున్నాయి) మొదట 7 ముక్కలు కనిపించాయట. కానీ కొద్ది కాలానికి ఒక ముక్క మాయమైపోయి నేటికి 6 ముక్కలే కనిపిస్తున్నాయి. అందుకే స్వాహాదేవి 7 రూపాలు దాల్చబోయింది. కానీ 6 రూపాలే దాల్చిందని చమత్కరించారు.

అప్పటి వరకూ అభిజిత్తు ధృవతారగా వుండేది. కానీ విష్వచ్ఛలనం వలన అభిజిత్తు ధృవస్థానం నుండి ప్రక్కకు జరిగిపోయింది. అదే అభిజిత్తు తపస్సు కోసం వెళ్ళిపోవటంలోని మర్మం.

అభిజిత్తు వుండే నక్షత్రరాశి పేరు వీణారాశి (LYRA) ఆ రాశికి, సప్తర్షి మండలానికి మధ్యలో తక్కువ కాంతితో వెలిగే కొన్ని తారలతో కూడిన మరో రాశి వుంది. దానిని పాశ్చాత్యులు "హెర్కులిస్" అంటారు. మన పండితులు కొందరు "హరికులేశుడు" లేక "శేషశాయి" అని అంటారు. ఈ నక్షత్ర మండలం మధ్యలో ముఖ్య తారలు 6 వున్నాయి. ఆ 6 తారలనే ఆరుగురు ఋషి పత్నులుగా ఈ కథలో వర్ణించారు. కృత్తికలు ఆరు తారలకు అధిదేవతలైన మునిపత్నులను ఈ ఆరుతారలకు అధిదేవతలుగా మార్పించాడు కుమారస్వామి. కృత్తికలు మరియు ఈ 6 తారలు ఒకే స్థాయి కాంతితో వుంటాయి కనుక పోలిక సరిపోయింది. మరియు ఈ 6 తారలు సప్తర్షుల ప్రక్కనే వున్నాయి.

ఈ మార్పు ఇంద్రుడి చేతి మీదుగా జరిగినట్లు పురాణంలో వుంది. ఎందుచేత? అభిజిత్తు స్థాన చలనం జరగటం.... ఈ తారలు ధృవతార స్థానానికి రావటం మొదలగునవి విష్వచ్ఛలనం వల్లనే జరిగాయి కదా! విష్వచ్ఛలనం, విష్వద్రేఖ... అన్నింటికీ మూలం ఇంద్రుడే కదా! విష్వచ్ఛలనం వల్లనే ఈ మార్పు జరిగిందని చెప్పటానికే ఈ కథలో ఇంద్రుని పాత్ర చేర్చబడింది.

ఏమయితేనేం ఈ కథలో ఇంద్రుడి పాత్ర చాలా మంచిది కదా!

సరే ధృవ స్థానంలోకి ఈ 6 తారల రాశి వచ్చింది అందులో ఖచ్చితంగా ధృవతారగా చెప్పబడిన నక్షత్రం ఏది? ఆరు తారలలో ఏ తార ధృవతారగా నిలచింది?

ఆ విషయం తెలియాలంటే మరో పురాణ కథని విశ్లేషించాలి.

✣ ✣ ✣

అహల్య కథ

పురాణ కథ : గౌతమ మహర్షి భార్య అహల్య. ఆమె అందం చూసి మోహంలో పడ్డాడు ఇంద్రుడు. ఒక రోజు తెల్లవారు ఝామునే వచ్చి కోడిపుంజులా అరిచాడు. తెల్లవారి పోతుందనుకుని గౌతముడు ఉదయ సంధ్యావందనానికి వెళ్ళిపోయాడు. అదే అదనుగా ఆశ్రమంలో దూరిపోయాడు ఇంద్రుడు. (అలా ఇంద్రుడొక్కడే వెళ్ళినట్లుగా కొన్ని గ్రంథాల్లో వ్రాయబడగా, ఇంద్రునితో పాటు సూర్యుడు కూడా వెళ్ళాడని కొన్ని చోట్ల వ్రాయబడింది మరియు గౌతముడి రూపంలో ఇంద్రుడు వెళ్ళాడనీ, అతను గౌతముడనే అహల్య పొరబడి ఇంద్రునితో కామకేళికి అంగీకరించి అతన్ని కలిసిందని కొందరు చెప్పగా... ఇంద్రుడు తన రూపంలోనే వెళ్ళి ఆమె పొందు కోరాడనీ, ఇంద్రుడంతటివాడు కోరటంతో ఆమె కాదనలేక కలసిందని


కొందరంటారు. అదే విధంగా ఇంద్రుడితో అహల్య కలసిన తరువాత సూర్యుడు కూడా ఆమెను కలిశాడని మరికొందరంటారు. వీటిలో ఏది నిజం? నిజం ఏమిటో ఆఖరున చెప్పుకుందాం) ఏది ఏమైతేనేం ఈ కథ ప్రకారం ఇంద్రుడితో అహల్య ప్రణయ క్రీడ జరిగిపోయింది. అప్పుడు గౌతముడు తిరిగి వచ్చాడు. జరిగిన దుశ్చర్య గమనించాడు. చాలా కోపం వచ్చింది. వెంటనే వారిని గౌతముడు శపించేశాడు. "శరీరమంతా 'యోని'లతో నిండిపోవాలని" ఇంద్రుడిని శపించాడు. "రాహుకేతువులచే మ్రింగబడమని" సూర్యుడిని శపించాడు". "బండరాయిగా మారి కదలక మెదలక పడివుండమని" అహల్యను శపించాడు.

వారు ముగ్గురూ భయపడి తమను క్షమించి శాపవిమోచనం ఇమ్మని గౌతముడ్ని ప్రార్థించారు. శాంతించాడు గౌతముడు. ఇంద్రుడి శరీరం నిండా 'యోని'లు కాకుండా కళ్ళతో శరీరం నిండి వుంటుందని శాపాన్ని మళ్ళించాడు. అలాగే సూర్యుడికి గ్రహణాలు కలిగినా తిరిగి విడిపోతుందని చెప్పాడు. అహల్య కొంత కాలంపాటు బండరాయిగా వుంటుందని, శ్రీరామ పాదం సోకిన వెంటనే ఆమె శాపం తీరిపోయి మరల మామూలుగా చలనం కలిగి మనిషి అవుతుందని విమోచన మార్గం చెప్పాడు.

అలాగే కొన్నివేల సంవత్సరాల తరువాత శ్రీరాముడి పాద స్పర్శతో అహల్య మామూలుగా మారింది. అప్పుడు గౌతముడు ఆమెను స్వీకరించాడు. అదీ పురాణకథ.


మరి అంతర్థాం చూద్దాం.


అభిజిత్తు తరువాత ఏ తార ధృవతార అయింది? అనుకున్నాం కదా! ఆ ధృవ తార పేరు అహల్య. ముందు కథలో చెప్పుకున్నాం కదా! ఆరుగురు మునిపత్నులు సప్తర్షి మండలానికి వీణారాశికి మధ్యలో చేరారని చెప్పుకున్నాము. అందులో ఒక తార పేరు అహల్య. అదే ఒకప్పటి ధృవతార.




జాగ్రత్తగా ఈ బొమ్మను పరిశీలించండి. క్రీ.పూ. 12000 ప్రాంతంలో అభిజిత్తు ధృవతారగా వుండేది. క్రీ.పూ. 10000 ప్రాంతానికి అహల్య ధృవతార అయింది. క్రీ.పూ. 8000 నాటికి అహల్య ధృవస్థానం నుండి విడుదల అయింది. తదుపరి హెర్క్యులిస్ మండలంలోని మరొ తార ధృవతార అయింది.

పెద్దవృత్తం – విష్వద్రేఖ
చిన్నవృత్తం – ధృవతారాచక్రం







అహల్య తదుపరి హెర్క్యులిస్‌లోని మరోతార ధృవతార కాగా దీని ఆధారంగా ఏర్పడిన విష్వద్రేఖ ఆకాశాన్ని చుట్టి వస్తూ రామబాణం (దీనినే పాశ్చాత్య కాసియోపియా అంటారు)లోని ఒక తారను స్పృశిస్తూ మరల హెర్క్యులిస్‌లోని ధృవ తారను చేరుట.

అహల్య ధృవతార అయింది. అంటే భూమి ఉత్తర అక్షం అహల్య తారకు సూటిగా వుండేలా తిరిగిందని అర్థం. అపుడు విష్వద్రేఖ అహల్య నుండి బయలుదేరి ఆకాశమంతా చుట్టు తిరుగతూ మరల అహల్య వద్దకు

చేరుతుంది. విష్వద్రేఖ పై సూర్యోదయం అయ్యే రోజు నుండి సంవత్సరారంభం చేసి కాలమానం లెక్కిస్తారు కదా! ఆ విషయం చెప్పటానికే అహల్య కథ ఏర్పడింది.

విష్వద్రేఖకి అధిదేవుడు ఇంద్రుడు
అహల్యతారకి అధిదేవుడు అహల్య
సూర్యగోళానికి అధిదేవుడు సూర్యుడు.
ఈ ముగ్గురి కలయిక చెప్పేదే ఈ కథ.

అహల్య అనే తారమీదుగా విష్వద్రేఖ వ్యాపించి వుండటమే అహల్య పై ఇంద్రుడు చేరి క్రీడించటంలోని మర్మం. అదే విధంగా ఆ విష్వద్రేఖ వద్ద సంవత్సరాది నాడు సూర్యుడు ఉదయించినట్లు చెప్పటానికే సూర్యుడు కూడ ఆమెతో కలసినట్లు చెప్పటంలో అర్థం. సంవత్సరారంభం సూర్యోదయంతో మొదలవుతుంది కదా! అందుకే యీ సంగమాలు తెల్లవారు ఝామున జరిగినట్లుగా చమత్కరించారు.

ఇకపోతే యందులో గౌతముడి పాత్ర కేవలం కథ రమ్యత కోసం కల్పించబడిందంతే.

మరి శాపాలు సంగతి చూద్దాం. సూర్యుడికిచ్చిన శాపం... "గ్రహణాలు - విడుపులు" కదా! అది క్రొత్తగా గౌతముడిచ్చిన శాపం కాదు. నిజానికి అంతకు ముందు కాలం నుండీ గ్రహణాలు కలుగుతూనే వున్నాయి. కేవలం కథ కోసం దాన్ని వాడుకున్నారు.

ఇంద్రుడికిచ్చినదీ శాపం కాదు. విష్వద్రేఖ అనగా ఆకాశానికి చుట్టబడిన వడ్డాణం వంటిది. ఆ రేఖ పొడవునా వేలాది నక్షత్రాలు మిల మిలా కళ్ళు మాదిరిగా కూడా మెరుస్తూంటాయి. అనాదిగా అలా జరుగుతూనే వుంది. ఇక క్రొత్తగా శపించేదేముంది! అహల్య శాపం సంగతి చూద్దాం. ఇంద్రుడు, సూర్యుడు, అహల్యను కలిసింది ఏ కాలం... అంటే అహల్య ధృవతారగా

వుండే కాలం. ధృవతార విషయం అందరికీ తెలిసిందే. ఒక్క ధృవతార తప్ప ఆకాశంలోని నక్షత్రాలన్నీ ప్రతిరోజూ తిరుగుతూనే వుంటాయి. తూర్పున ఉదయించి మెల్లగా స్థాన చలనం చేస్తూ పశ్చిమాన అస్తమిస్తూ వుంటాయి. ధృవతార మాత్రం గోడకు కొట్టిన మేకు మాదిరిగా సర్వవేళలా కదలక మెదలక అదే స్థానంలో వుంటుంది. ఆ విధంగా సుమారు రెండు వేల సంవత్సరాలపాటు వుండి పోవటంలోని అంతరార్థం అదే.

సుమారు రెండు వేల యేళ్ళ తదుపరి అహల్యా తార ప్రక్కకుపోయి మరోతార ధృవస్థానంలోకి వస్తుంది. అప్పుడు దాని ఆధారంగానే విష్వద్రేఖ ఏర్పడుతుంది. ఆ రేఖ ఆకాశాన్ని చుట్టివస్తూ రామబాణం ఆకారంలో గల కాసియోసియా నక్షత్ర మండలాన్ని తాకుతుంది. అదే రామ పాద స్పర్శలోని అంతరార్థం. ఆ సమయానికి ధృవస్థానం నుండి అహల్యా తార ప్రక్కకి వెళ్ళి పోయింది కదా! అంటే ఇక ఆ తార స్థిరంగా వుండి పోకుండా అన్ని తారలవలె తూర్పుదిశలో ఉదయిస్తూ పశ్చిమాన అస్తమిస్తూ చలనం కలిగి వుంటుంది. అదే అహల్యాదేవి మరల స్త్రీ రూపం దాల్చటంలోని మర్మం.

అదీ అహల్యా కథలోని రహస్యం.

ఇక్కడ మనం కొంత చర్చించవలసిన అవసరం వుంది. అయితే ఈ కథలు నిజంగా జరగలేదా? ఋషులు కల్పించి వ్రాసిన కథలా? అనే సందేహం వస్తుంది కదా! నిజం చెప్పాలంటే.... మొదటి కథలో కుమారస్వామి జననం వరకూ నిజమైన పురాణమే తదుపరి ఋషులు తమ భార్యలనువదిలిపోవటం కృత్తికలలోని మునిపత్నుల అంశలను ఇంద్రుడు ఉత్తర ధృవచక్రంలోని తారలలో నిక్షేపించటం, ఋషుల కల్పనలే అని చెప్పక తప్పదు. అలాగే అహల్య తప్పు చేయటం, గౌతముడు శపించటం... కల్పితమే. కానీ ఈ నిజాన్ని ఒప్పుకోవటానికి చాలా మందికి మనస్కరించదని నాకు తెలుసు. ఎంతోకాలంగా ఈ గాథలు జరిగినట్లుగా

నమ్మకంలో వున్న ప్రజలు ఈ నిజాన్ని జీర్ణించుకోలేరు. ఆరుగురు మునిపత్నులు పరిపూర్ణ శుద్ధత లేనివారు అందుకే వారిని వారి భర్తలు వదిలేశారు అనే పలుకులను ఆనందంగా నమ్మే ప్రజలు చాలామందే ఉంటారు. కానీ అది కేవలం విజ్ఞాన విషయాలను తెలియజేసే అంతరార్థపూరిత విషయం అంటే నమ్మలేరు. కానీ ఆలోచించండి. అనసూయ అంటే యెవరు? రాళ్ళనే గుగ్గిళ్ళుగా వుడికించిన మేధావి. త్రిమూర్తులనే పసిపిల్లలుగా మార్చిన పతివ్రత. జాహ్నవీ నదిని దారి మళ్ళించిన ఇంజనీర్. త్రిమూర్తులు అంశంగా చెప్పబడిన దత్తాత్రేయుని కన్నతల్లి. అలాంటి పతివ్రతను తప్పు చేసిన స్త్రీగా ఒప్పుకుంటారు కానీ ఈ కథ కేవలం కల్పితం అంటే ఒప్పుకోలేరు కొందరు ఛాందసులు. పరశురాముని కన్నతల్లి రేణుక లోప భూయిష్టమైన స్త్రీ అంటే ఒప్పుకుంటారు గానీ, ఇది విజ్ఞాన గాధ అంటే రుచించదు ఛాందసులకు. ఇంద్రాది దేవతలకే కాక వామనావతారుడికి కూడా తల్లి అదితి. మరి ఆమెని తప్పు పట్టగలమా? మిగిలిన ఋషిపత్నులూ పతివ్రతములుగా పేరు పడినవారే. వారిలోయెవ్వరూ అరుంధతి కంటే తక్కువ వారు కాదు. మరి అరుంధతి రూపుదాల్చలేని స్వాహాదేవి మిగిలిన వారి రూపాలను దాల్చటం, అందుకని వారి భర్తలు వారిని వదలి వెళ్ళటంలో నిజం వుందంటరా? లేదు అదంతా విజ్ఞాన వివరాల కోసం అల్లిన కథ మాత్రమే. ఇక రెండవ కథ విషయం చూద్దాం.

పాపం అహల్య మొదటికథలోనూ నిందమోసింది. రెండవ కథలో మరింత ఘోరమైన నింద మోసింది. అయితే అహల్య పతివ్రత కాదా! అలా అయితే గౌతముడు మరల ఆమెనెలా స్వీకరించాడు? పతితను స్వీకరించాడా?

మొదటి కథ రచించిన ఋషి ఇంద్రుడికి చాలా మంచి పాత్రనే

యిచ్చాడు. కానీ రెండవ గాథా రచయిత మాత్రం ఇంద్రుడిని చాలా దుర్మార్గుడుగా చిత్రీకరించాడు. మొత్తం ఇంద్రుడి జీవింలో యింతకంటే దుర్మార్గమైన, నీచమైన కార్యం లేదేమో అనేటంత చెడ్డవాడిగా చిత్రించబడ్డాడు. కానీ ఇది కేవలం విజ్ఞాన కథ మాత్రమే. ఇంద్రుడు శరీరం నిండా నేత్రాలు వుండటం ఏవిధంగా కల్పితమో ఇంద్రుడు దుష్క్రియ చేయటం ఆవిధంగా కల్పితమే.

పాపం ఏమి ఎరుగని సూర్యుడికీ నింద అంటగట్టారు. సూర్యుడు, భూమి, చంద్రుడు తిరగటం మొదలైన నాటి నుండీ గ్రహణాలు ఏర్పడుతూనే వున్నాయి. ఇక క్రొత్తగా సూర్యుడు నేరం చేయటం, శాపం పొందటం... అనేవి అసహజంగా లేవూ?

క్రీ.పూ. 10000, క్రీ.పూ. 8000 మధ్య ఏ నక్షత్రం ధృవతార అయింది. విష్వద్రేఖ ఎక్కడ వుండేది? సంవత్సరాది రోజున సూర్యుడెక్కడ ఉదయించేవాడు? తదుపరి మార్పు ఎలా జరిగింది? అనే ఖగోళ విజ్ఞానాంశాలను తెలియచేయటానికే ఈ కథలను ఇలా చెప్పారు. అంతే కాని ఇంద్రుడు దుర్మార్గుడు కాదు. అహల్య తప్పు చేయలేదు. సూర్యుడు నేరం ఏమీ లేదు. గౌతముడెవరినీ శపించలేదు.

ఇక్కడ మరో విషయం కూడా చెప్పాలి.

ఈ ఇంద్రకథలు వేదాలలో యెందుకు వ్రాయబడ్డాయంటే.... కాలమానం, ఖగోళంలో మార్పులు తెలియచేయటానికే. అయితే ఈ కథలు 3 విధాలుగా వ్రాయబడ్డాయి.

1. ధృవతార నిర్దిష్టంగా వుండే కాలంలో ఇంద్రుడే స్వయంగా స్వర్గాన్ని యేలు తున్నట్లు లెక్క అలాంటపుడు ఇంద్ర కథలు ధృవతార వద్ద అల్లుకుని వుంటాయి. దానికి ఉదాహరణపై రెండు కథలు.
2. ఖచ్చితమైన ధృవతార లేని కాలంలో భూమి ఉత్తర అక్షానికి తిన్నగా

కాకున్నా కొద్దిపాటి దూరంలో వున్న ముఖమైన తారను ఉపధృవతార అంటాం కదా! ఆ కాలంలో ఇంద్రుడు పదవిని కోల్పోయి మరో తాత్కాలిక ఇంద్రుడు స్వర్గపాలన చేస్తున్నట్లుగా ఆ ఉపధృవతార వద్ద కథలు అల్లుకుని వుంటాయి.

ఉదా : నహుషుడు కథ.

3. మరి కొన్ని సందర్భాల్లో ఇంద్రకథలు ధృవతారల వద్ద కాకుండా విష్వద్రేఖ ఆకాశంలో వ్యాపించి వున్న చోట వుండే ముఖ్య తారలు లేక రాశులు వద్ద అల్లుకుని వుంటాయి.

ఉదా : విశాఖ తారపై మరియు చిత్ర తారపై విష్వద్రేఖ వున్నపుడు ఆ తారల ఆధారంగా ఏర్పడిన వేద కథలు.

❖ ❖ ❖

అదితి యుగం కథలు

(2 తలల పునర్వసు, అగ్నాదానం, పారిపోయిన యజ్ఞం)

అలాంటివే మరి కొన్ని కథలు ముందు ముందు చూద్దాం.

సుమారు క్రీ.పూ. 8000 ప్రాంతంలో హెర్కులిస్ తార ధృవతార అయింది. కదా! దాని ఆధారంగా ఏర్పడే విష్వద్రేఖ వద్ద సూర్యోదయంతో సంవత్సరారంభం చేసి, కాలమానం లెక్కిస్తూ, యజ్ఞయాగాలు కొనసాగించేవారు.

మరో 2 వేల యేళ్ళు గడిచాయి. విష్వచ్ఛలనం వలన ఆ నక్షత్రం ధృవస్థానం నుండి ప్రక్కకు పోయింది. అయితే మరో క్రొత్త ధృవతార ఏదీ ఏర్పడలేదు. కారణం ఏమిటంటే... హెర్కులిస్ రాశికీ తదుపరి ధృవస్థానం పొందగల తారకీ ("తూబా" అనే తారకి) మధ్య చాలా దూరం వుంది. (తూబా ధృవతారగా నిలచిన కాలం క్రీ.పూ. 3000 ప్రాంతం) మరి ఈ మధ్యలో ఏ

తారా ధృవతార అయ్యే అవకాశం లేదు. కనీసం ఉపధృవతార ఏర్పడడానికైనా దరిదాపులలో ముఖ్యతార ఏదీలేదు. మరి ధృవతార లేకుండా విష్వద్రేఖను ఎక్కడ నుండి ప్రారంభించాలి? కాలమానం ఎలా లెక్కించాలి? అందువలన కాలమానం లెక్క ఆగిపోయింది, యజ్ఞయాగాలు ఆగిపోయాయి.

ఈ విష్వద్రేఖ ఎక్కడ వుంది? ఇంద్రుడు ఏమైపోయాడు? యజ్ఞాల సంగతి యేమిటి? అని తికమక పడిన ఋషులు అనేక పరిశోధనలు చేసి సుమారు క్రీ.పూ. 6000 కాలంలో విష్వద్రేఖ మిధున రాశిలోని పునర్వశు తారల వద్ద వుందని కనుగొన్నారు.

పునర్వశు తారలు రెండు. వాటికి అధిదేవత అదితిమాత. ఆ తారల వద్ద విష్వద్రేఖ వుండటం గమనించి, ఇంద్రుడు తన తల్లి అయిన అదితి ఒడిలోనే వున్నాడని వ్రాశారు. ఆ విష్వద్రేఖ వద్ద సూర్యుడు ఉదయించగానే సంవత్సరారంభం చేశారు. అంటే పునర్వశు వద్ద సంవత్సరారంభంలో సూర్యుడుదయిస్తాడు కనుకనే ఋగ్వేదంలో సూర్యుడు అదితి గర్భాన ఉదయించాడని వ్రాశారు ఋషులు. అందుకే సూర్యుడిని ఉపేంద్రుడు (ఇంద్రుని తమ్ముడు) అంటారు.

2 తలల పునర్వశు :

అదే విధంగా ఋగ్వేదంలోనూ, వాజసనేయ సంహితలోనూ ఒక చిన్న కథ వ్రాయబడింది ఆ కాలంలోనే.

పునర్వశుకు రెండు శిరస్సులు, ఒక తలతో యజ్ఞం ఆరంభిస్తుంది. మరోతలతో యజ్ఞాన్ని ముగిస్తుంది అని ఆ కథ సారాంశం.

యజ్ఞం అనగా సంవత్సరం అని అర్థం వుంది కదా! పునర్వశు వద్ద (సూర్యోదయంతో) సంవత్సరం ఆరంభమగును మరల అక్కడే సంవత్సరం ముగియును అని అర్థం.

విష్వద్రేఖ పునర్వశులో వుందని చెప్పటమే ఈ కథ ధ్యేయం.

అగ్నాదానం :

పూర్వంనం దేవతలు అగ్నాదానం అనే యాగం చేసేవారు. ధనమదంతో యాగం మానేశారు. ఫలితంగా వారి సంపదలన్నీ నశించాయి. అపుడు వారు తమ తప్పును గుర్తించి ఎన్నో ప్రయాసలు పడి పునర్వశు వద్ద యజ్ఞం ఆరంభించారు. ఈ కథ తైత్తిరీయ బ్రాహ్మణం 1-1-1-2 లోనిది.

చిత్రమైన ఈ కథకు అంతరార్థం వుంది ఈ కథలో దేవతలు అనగా దైవజ్ఞులైన ఋషులు, యజ్ఞాలు చేమయటమంటే కాలమాన పంచాంగాలు రచించి దాని ఆధారంగా యజ్ఞాలు చేయటం. కొంతకాలానికి విష్వద్రేఖ మార్పువలన కాలమానం చెడింది. యజ్ఞాలు ఆగిపోయాయి. అనేక తిప్పలుపడి విష్వద్రేఖను పునర్వశు వద్ద వున్నట్లు గుర్తించి మళ్ళీ కాలమాన పంచాంగం, యజ్ఞాలు ఆరంభించారు అదీ ఆ కథలోని అర్థం.

పారిపోయిన యజ్ఞం :

ఋగ్వేదంలో మరో వింత కథ వుంది. ఒకపుడు యజ్ఞం పారిపోయిందట. యజ్ఞాలు లేక దేవతలు బాధపడుతున్నారు. అపుడు దేవమాత అదితి యాజ్ఞాన్ని కనుగొని యిచ్చింది. మరల యజ్ఞం ప్రారంభమయింది.

అసలు యజ్ఞం పారిపోవటం యేమిటి? ఎలా పారిపోతుంది? అంటే సంవత్సరం (యజ్ఞం) పారిపోయింది. అంటే నిజంగా పారిపోవటం కాదు. సంవత్సరారంభం ఎపుడు చేయాలో కాలమానం ఎలా గమనించాలో పండితులకు తెలియటం లేదు. కారణం విష్వద్రేఖ స్థల మార్పు వలన పాత పంచాంగాలు తప్పుతున్నాయి. అందుకే కాలమానం తెలియక అంతా అవస్థపడుతుండటమే, యజ్ఞాలు లేక తేవతలు బాధపడంలోని అంతరార్థం. అనేక పరిశోధనల అనంతరం పునర్వశులో వున్న విష్వద్రేఖను కనుగొని

అక్కడి నుండి సంవత్సరారంభం చేశారు. అదే అదితి మాత యజ్ఞాన్ని కనుగొని యివ్వటంలోని అర్థం.

ఈ విధంగా క్రీ.పూ. 6000 నాటి వేద కథలు పునర్వశులో విష్వద్రేఖ గురించి వివరించాయి. కానీ ఈ కథల్లో ఇంద్రుడి పాత్ర చాలా స్వల్పంగా, అస్పష్టంగా మాత్రమే వుంది. ఎందుకంటే యీ కథలో ధృవతారతో సంబంధం లేదు కదా!

అయితే పునర్వశు యుగం గూర్చి ఋజువిచ్చే కథలో ఇంద్రుడి పాత్ర హెచ్చుగా వున్న కథలు వున్నాయి. మన పురాణాల్లో గల అలాంటి కథ ఒకటి చూద్దాం.

✣ ✣ ✣

చ్యవనుడు - అశ్వినులు

వృద్ధుడు, గ్రుడ్డివాడు అయిన చ్యవన మహర్షికి అశ్వినీ దేవతలు కళ్ళు, యవ్వనం ప్రసాదించారు. అందుకు ప్రతిగా అశ్వినులకు యజ్ఞంలో హవిస్సు భాగం యిస్తానన్నాడు చ్యవనుడు. అప్పటి వరకు యజ్ఞ హవిస్సులు ఇంద్రాదిదేవతలందరికీ చెందేవి. కానీ అశ్వినులకు భాగం యిచ్చేవారు కాదట. చ్యవనుడి మామగారైన సంయాతి చేత ఒక యజ్ఞం ప్రారంభం చేయించాడు చ్యవనుడు. ఆ యజ్ఞంలో సోమపానం, హవిర్భాగం అశ్వినీ దేవతలకు యిచ్చాడు. అలా యివ్వటానికి వీలు లేదంటూ ఇంద్రుడు అడ్డు చెప్పాడు. అయినా చ్యవనుడు వినలేదు. అందుకు కోపంతో ఇంద్రుడు వజ్రాయుధం తీసి చ్యవనుడి పైకి దూకాడు. చ్యవనుడు తన తపోబలంతో ఇంద్రుడిని నిశ్చేష్టుడిగా చేసి, హోమగుండం నుండి మదుడు అనే రాక్షసుని సృష్టించి ఇంద్రుడిమీదకు పంపించాడు. ఇంద్రుడు భయపడి చ్యవనుడిని క్షమాపణ కోరాడు. మదుడు మాయమై పోయాడు. ఇంద్రుడు వెళ్ళిపోయాడు. అప్పుడి నుండి యజ్ఞహవిర్భాగం అశ్వినిలకు యివ్వబడింది.

అదీ పురాణగాధ. పునర్వశు తారలు అంటే... మిధునరాశిలో ముఖ్యమైన కాంతివంతమైన రెండు జంట తారలనే పునర్వశు తారలు అంటారు. వీటిని మన పురాణాలలో కొందరు ఋషులు అశ్వనీ దేవతలు అనే కవలలైన దేవతలని అభివర్ణించారు. అశ్వినులు దయగలవారు. అందరికీ సహాయం చేసేవారు. మరియు గొప్ప వైద్యులు. అని వేద, పురాణాలు చెబుతున్నాయి. పునర్వశు తారలకు అధి దేవత అదితి మాత అని కూడా మన గ్రంధాలలో వుంది మరియు అశ్వినీ దేవతలకు అదితి తల్లి అని కూడా కొందరు ఋషులు వ్రాశారు. (సూర్యుడికి, శరణ్య అనే ఆడ గుర్రానికి అశ్వినులు పుట్టారని కొందరంటారు) కనుక అశ్వినీ దేవతలే ఈ పునర్వశు తారలనీ, వారికి తల్లి పునర్వశుకు అధిదేవత అదితి యనీ నిర్ధారణ అవుతుంది.

(పాశ్చాత్యులు కూడా ఈ పునర్వశు తారలను కవల దేవతలనే అంటారు. వారి పేర్లు పోలక్స్, కేస్టర్ వీరు కూడా ఇతరులకు సహాయ కార్యక్రమాలు చేసేవారని పాశ్చాత్యుల నమ్మకం.)

అందుచేత అదితి కథలయినా, అశ్వినీ దేవతల కథలైనా పునర్వశు తారలతో ముడిపడి వుంటాయి. అటువంటి కథే చ్యవన మహర్షి కథ.

బహుశా విష్వద్రేఖ పునర్వశులోని మారిందని మొదటగా కనుగొన్నది చ్యవన మహర్షే కావచ్చు అందుకే ఆ కథకు నాయకుడు చ్యవనుడే అయ్యాడు.

క్రీ.పూ. 6000 ముందు వరకు పునర్వశు (అశ్వినీ దేవతలు)కి కాలమానం, సంవత్సరం లెక్క మొదలైన వాటితోత సంబంధం లేదు. అందుకే యజ్ఞంలో హవిర్భాగం అశ్వినులకు లేదని చమత్కరించారు. విష్వద్రేఖ పునర్వశులో వుందని కనుగొన్న చ్యవనుడు పునర్వశు నుండి సంవత్సరం ఆరంభించాలని ప్రతిపాదించాడు. అదే అశ్వినులకు హవిర్భాగం యివ్వటంలో అర్థం. ఇక్కడ అడ్డుపడినవాడు నిజానికి ఇంద్రుడు కాదు. మిగిలిన మేధావులు, ఋషులు అడ్డుపడ్డారు. ఎందుకంటే నిజంగా విష్వద్రేఖ పునర్వశులో వుందా? లేదా? అని సంశయంలో వున్నారు వారు.

అందుకే వారు చ్యవనుడు ప్రతిపాదనను అంగీకరించలేదు. కానీ పట్టువదలని చ్యవనుడు తన వాదనను ఋజువుచేసి చూపించాడు. దానితో మిగిలిన ఋషులు అంగీకరించారు. అప్పటినుండి పునర్వశు నుండి సంవత్సరారంభం చేయసాగారు. ఇంద్రుడు ఓడిపోయి, అశ్వినులకు హవిస్సు యీవ్వటానికి అంగీకరించటం, అంటే అప్పటినుండి అశ్వినులకు యజ్ఞభాగం య్యిబడటంలోని అంతరార్థమదే.

ఆ విధంగా అనేక పునర్వశుయుగ కథలు మన వేద, పురాణాలతో వ్రాయబడ్డాయి. అలా వేయి సంవత్సరాలపైగా అదితి యుగం సాగింది. తదుపరి కొంతకాలం విష్వద్రేఖ అగ్నేయ మూల వుదయించే అగస్త్య తార దగ్గర వుందని అగస్త్య సూర్య సహోదయంతో సంవత్సరారంభం చేసేవారు. కొంతకాలానికి భూమి విష్వచ్ఛలనం మూలంగా అగస్త్యతార ఆగ్నేయం నుండి దక్షిణ దిశకు జరిగిపోయింది. అందువలన సంవత్సరారంభం అగస్త్యుని వద్ద సరిపడలేదు. ఆ రోజులలోనే అగస్త్యుడు వింధ్య పర్వతాలను వంచి, వింధ్యను దాటి దక్షిణ దిశగా వెళ్ళిపోయినట్లుగా పురాణకథలు వెలువడ్డాయి. అనంతరం కొంతకాలం సిరియస్ అనబడు మృగవ్యాధ తారవద్ద విష్వద్రేఖను గమనించి ఆ తారతో సూర్యసహోదయదినం నుండి సంవత్సరారంభం చేసేవారు.

ఈ సూర్యసహోదయంతో సంవత్సరం ఆరంభించే పద్ధతి పాశ్చాత్యులకు యీ సిరియస్ కాలం నుండి మాత్రమే తెలుసు. మన వారికి మాత్రం అంత కంటే 10000 ఏళ్ళ క్రితం నుండీ తెలుసునని ముందే చెప్పుకున్నాం కదా!

ఆ తరువాత క్రీ.పూ. 2500 ప్రాంతం వరకు తదుపరి ధృవతార యేదీ లేకపోవటం వలన భూమి ఉత్తరధృవం ధృవతారాచక్రంపై ఏ స్థానానికి సూటిగావుందో అంచనా వేసి దాని ఆధారంగా విష్వద్రేఖను వూహించి గీశారు. ఆ రేఖ రాశిచక్రంలోని ఏ రాశి లేక ఏ దేవి ముఖ్య తారమీదుగా

వెళ్తుందో ఆ తార వద్ద సూర్యసహోదయంతో సంవత్సరారంభం చేయటం మొదలుపెట్టారు. ఆ క్రమంలోనే అగస్త్య తారపై కొంతకాలం, తరువాత మృగవ్యాధ (సిరియస్) తారపై కొంతకాలం విష్వద్రేఖ వుండటం వలన ఆయా కాలాలో ఆ తారల సూర్యసహోదయంతో సంవత్సరారంభం చేసేవారు (పాశ్చాత్యులకు యీ కాలం నుండి మాత్రమే విష్వద్రేఖ, సూర్యసహోదయ పద్ధతి తెలుసు.) ఆ తరువాత విష్వద్రేఖ మృగశిర రాశిలోకి జరిగింది. మృగశిర రాశిని ఒక లేడి శిరశ్శుకు అడ్డుగా ఇటు నుండి అటువేపుకు ఒక శరం (బాణం) దిగబడి వున్నట్లుగా మన ఋషులు చిత్రీకరించారు. అందుకే దానికి "మృగశిర" అని పేరు పెట్టారు. ఈ మృగశిర తారలతో పాటు ఆరుద్ర మరియు కొన్ని పరిసర నక్షత్రాలను కలపి ఒక భారీ కాయం గల వ్యక్తి రూపాన్ని చిత్రీకరించారు కొందరు ఋషులు. పాశ్చాత్యులు కూడా ఆ విధమైన భారీ కాయుడ్ని చిత్రించి అతడికి 'ఒరియన్' అని పేరు పెట్టారు. ఒరయన్ ఒక వీరుడైన వేటగాడు చివరికి ఈ వేటగాడు ఒక పెద్ద తేలు కుట్టడం వలన చనిపోయాడని పాశ్చాత్యుల కథ. (తూర్పున వృశ్చికరాశి వుదయిస్తుంటే పడమర దిక్కున యీ ఒరయన్ అస్తమిస్తుంటాడు. అందుకే పాశ్చాత్యులు అలా వ్రాశారు).

మన భారత మేధావులు మృగశిర తారలను బాణం గ్రుచ్చుకున్న మృగశిరశ్శుగా కొందరు వ్రాస్తే, మృగశిర తారలు శ్రీ కృష్ణుడికి చిహ్నం అనీ ఆ తారలు గొల్లకావడి, పిల్లన గ్రోవి ఆకారంలో వుంటాయని కొందరు చిత్రీకరించారు.

అలాగే ఒరయన్ అనే ఆ భారీ శరీరుడ్ని మన ఋషులు కొందరు వృత్రాసురుడుగా, కొందరు 'నముచి' అనే రాక్షసుడిగా, కొందరు నరకాసురుడనీ రకరకాలుగా సందర్భానుసారంగా వర్ణించారు.

ఆ కథలను కొన్నింటిని చూద్దాం.

✣ ✣ ✣

వృత్రాసురుడు - మృగశిరయుగ కథలు

(పచ్చమృగం కథ, సరమ పరిశోధన, నముచి కథ)

వృత్రాసురుడు :

ఋగ్వేదం 1-32 లోని కథ చూద్దాం.

1. వృత్రాసురుడు మృగరూపం దాల్చి పారిపోతుంటే ఇంద్రుడు వెంటదరిమి బాణంతో దాన్ని చంపేశాడు. అప్పుడు అక్కడే క్రొత్త సంవత్సరం సముద్రం నుండి పుట్టింది.

మృగరూపం దాల్చిన వృత్రుడు అంటే మృగశిర తారా సమూహం. కాలక్రమేణా జరుగుతూ జరగతూ మృగశిర వద్దకు విష్వద్రేఖ చేరటమే ఇంద్రుడు వెంటతరమటం, చంపటంలోని అర్థం. అక్కడ సముద్రం అంటే పాలపుంత (మిల్కీవే) అక్కడే వుంది కదా! అక్కడ సంవత్సరం పుట్టడం అంటే విష్వద్రేఖ, మృగశిర కలసిన ఆ చోట సూర్యోదయంతో సంవత్సరం ప్రారంభమయేదని భావం అనగా అది క్రీ.పూ. 4000 ప్రాంతం.

ఇంద్రుడు వృత్రుని చంపటం గూర్చి వేద పురాణాల్లో రకరకాలుగా వ్రాయబడింది. ఏదయినా విజ్ఞానాంశాలను తెలియచేయటం కోసమే ఈ కథ విష్వద్రేఖ వునికిని చెప్పేకథ కాగా మరోచోట వ్రాయబడిన వృత్ర సంహారం మరో విశేషాన్ని చెబుతుంది.

2. ఈ కథ వేదాల్లోనే కాక పురాణాల్లోనూ వుంది.

భూమి మీద జలాశయాలన్నింటిలోని నీటిని త్రాగేసి పెద్ద పొట్ట పెంచుకున్న వృత్రాసురుడు ఆకాశంలోకి పోయి కూర్చున్నాడు. నీరు లేక ప్రజలు బాధపడ సాగారు. అప్పుడు ఇంద్రుడు దేవతలను, మరుత్తులను తోడు తీసుకుని వృత్రునిపై దాడిచేసి వజ్రాయుధంతో వృత్రుడి పొట్ల చీల్చి వేశాడు. అప్పుడా పొట్టలోని నీరు జలజలా భూమిపైకి కారిపోయి మరల జలాశయాలన్నీ నిండిపోయాయి.

ఈ కథ నేటికీ ప్రత్యక్షంగా జరుగుతూనే వుంది.

వృత్రుడనగా కారు మేఘం. ఎండవేడికి జలాశయాల్లోని నీరు ఆవిరిగా మారి మేఘాల్లో చేరటమే వృత్రుడు నీరంతటినీ త్రాగేసి ఆకాశంలో కూర్చోవటంలోని అర్థం. ఇంద్రుడి వజ్రాయుధం అనగా మెరుపు, ఉరుములతో, కూడిన పిడుగు. మరుత్తులనగా పిల్లగాలు. అనగా చల్లని గాలులు వీచగా వురుములు, మెరుపులతో కూడి పెద్దజడివాన కురియటమే వజ్రాయుధపు దెబ్బకు వృత్రుడి పొట్ట చిరగటం. వర్షాల వలన జలాశయాలు నిండటం. వర్షాలెలా కురుస్తాయో వివరించటమే యీ కథలో అంతరార్థం.

ఈ కథ పూర్తి వివరాలకు మా "పురాణగాథల్లో సైన్సు అద్భుతాలు" చదవండి.

పచ్చమృగం : ఇది ఒక ఋగ్వేద కథ.

పచ్చమృగం రాగానే యజ్ఞం ఆగిపోయింది. అందుకు ఇంద్రాణి కోపించి కుక్కలను వుసిగొలిపింది. శరముతో మృగశిరస్సును ఖండించింది. ఇంద్రుడామెను శాంత పరచి, మరలవుదయించమని సూర్యుడ్ని పిలిచాడు. సూర్యుడు వచ్చేసరికి మృగం పారిపోయింది. యజ్ఞం మొదలయింది.

దీని అంతరార్థ మేమిటంటే పచ్చమృగం అంటే మృగశిరరాశి. మృగశిర వద్ద పాత సంవత్సరం ముగియటమే యజ్ఞం ఆగిపోవటం. అక్కడ సిరియస్, ప్రోశ్యాన్‌లు అనే కుక్కలు (నక్షత్రరాశులు) ఉన్నాయని చెప్పటమే కుక్కలను వుసిగొలపటం. మృగం శిరశులో శరం గుచ్చు కున్నట్లుగా మృగశిర రాశివుంటుంది కదా! అదే మృగాన్ని శరముతో ఖండించటం. ఇంద్రుడు సూర్యుడ్ని ఆహ్వానించటం అంటే విషువ్రేఖ వద్ద సూర్యోదయంతో సంవత్సరారంభం. సూర్యుడు వుదయించాక సూర్యకాంతిలో మృగశిర కన్పించదు. అదే మృగం పారిపోయిందనటంలో మర్మం.

ఈ కథకూడా క్రీ.పూ. 4000 నాటి మృగశిర యుగకథే.

సమర పరిశోధన : ఇది గోపద బ్రాహ్మణంలోని వుపాఖ్యనం. ఋగ్వేదం 1-72-8 మరియు ఋగ్వేదం5-45-7,8 లోనూ యీ కథ వుంది.

ఒకసారి బ్రాహ్మణుల గోవులును దొంగలు ఎత్తుకుపోయి ఒక కొండ గుహలో దాచేశారు. దాని వలన యజ్ఞాలకు అంతరాయం కలిగింది. ఆ గోవులను వెతకటానికి సరమను పంపించాడు ఇంద్రుడు. (సరమ అనగా కుక్కల జాతికి తల్లి) గోవుల అడుగుజాడల ఆధారంగా అడవులు నదులు దాటి వెళ్ళి గోవులను కనుగొన్న సరమ ఇంద్రుడికి చెప్పింది. ఇంద్రుడు దొంగలపై దాడి చేసి గోవులను విడిపించాడు.

సిరియస్ నుండి విష్వద్రేఖ మృగశిపైకి మారినప్పుడు వ్రాయబడిన కథయిది. ఇక్కడ దోచుకుపోబడిన గోవులు అనగా సంవత్సరంలోని దినాలు. విష్వద్రేఖ స్థలమార్పు వల్ల కాలమానం తప్పింది. సంవత్సంలో కొన్నిదినాలు లోపించాయి. అందుకే కొన్ని గోవులు దొంగిలించబడ్డాయి అన్నారు. ఇక్కడ సిరియస్ (పెద్దకుక్క)నే సరమ అని వర్ణించారు. సరమ దాటిన నది అనగా పాలపుంత. అనగా పాలవుంతకు యీవల వున్న సిరయస్ వద్ద నుండి ఆవతలవున్న మృగశిరకు విష్వద్రేఖ మారిందని అర్థం. మృగశిర నుండి సంవత్సరారంభం చేస్తే కాలమానం సరిపోయింది. కనుక మరల గోవులు దొరికినట్లు... యజ్ఞం మొదలయినట్లు చమత్కరించారు ఋషులు.

'గోవులు' అంటే అనేక అర్థాలున్నాయి. సందర్భానుసారంగా ఆ మాటను వేద ఋషులు వాడేవారు. గోవులు అనగా-పశువులు, నీటిబిందువులు, నక్షత్రాలు, సూర్యకిరణాలు, అగ్నిహోత్రాలు..... అనే అర్థాలను వేద ఋషులు చూపించారు. దీని వివరం మా "సులభశైలిలో వేదవిజ్ఞానం"లో చదవండి.

మరో మృగశిర యుగపు కథ....

నముచి కథ : ఋగ్వేదం 1-53-7లో ఇంద్ర, నముచిల కథ వుంది.

వరప్రభావం కలిగిన నముచి అనే రాక్షసుడిని ఇంద్రుడు జయించలేకపోయాడు. ఎందుకంటే నముచి నేలపై వుండగా కానీ, నీటిలో వుండగా కాని చావడు. రాత్రిగాని, పగలుకాని చావడు. తడి ఆయుధం కానీ పొడిగా వున్న ఆయుధం కానీ అతన్ని చంపలేరు. అదీ వాడు పొందిన వరం.

విష్ణుదేవుని సలహాపై ఇంద్రుడు నముచితో స్నేహం నటిస్తూ తిరుగసాగాడు. ఒక రోజున తెల్లవారు ఝామున నముచి, ఇంద్రుడు కబుర్లు చెప్పుకుంటూ పాల సముద్రపు ఒడ్డున పాదాలు వరకూ నీటిలో (పాలలో) మునిగి వుండే స్థితిలో నడుస్తున్నారు. ఆ సమయంలో విష్ణుదేవుడు ఆ సముద్ర నురుగులో చేరివున్నాడు. అది గమనించిన ఇంద్రుడు ఆ నురుగును తన వజ్రాయుధానికి పట్టించి దానితో నముచిని చంపేశాడు. అప్పుడు సముద్రంలో నుండి కొత్త సంవత్సరం పుట్టింది. అదీ కథ. నముచిని చంపిన సమయం తెల్లవారుఝాము అనగా అది రాత్రికాదు పగలు కాదు. వారు నడిచేది నేలమీదా? అంటే సముద్రంలో పాదాలు తడుస్తున్నాయి. నీటిలోలోనా? అంటే పాదాల క్రింద ఇసుక నేలవుంది. కనుక అది నేలకాదు నీరుకాదు. మరియు నముచిని చంపిన నురుగు తడి వుస్తువుకాదు. పొడివస్తువుకాదు కదా! ఆ విధంగా నముచికి గల వరాన్ని ఛేదించాడు ఇంద్రుడు. చాల తెలివిగా, తమాషాగా వుంది కదా! నముచి వరాల కథ. ఇందులో ఇంద్రుని మోసం యేమీలేదు. అదంతా కేవలం విజ్ఞాన విషయం అంతే...

ఈ కథ భావం యేమిటంటే.....

మృగశిర, ఆరుద్ర మరికొన్ని సమీపతారలు కలిసి నముచి రాక్షసరూపం యేర్పడుతుంది. ఆ తారామండలంతో విష్వద్రేఖ కలసి వుండటమే ఇంద్రుడు, నముచిల కలయిక. ఆ తారలు వున్నది పాలవుంత

వద్దనే కదా! అందుకే వారిద్దరూ సముద్ర తీరంలో నడుస్తున్నారని వ్రాయబడింది. అది తెల్లవారు ఝామువేళ క్రొత్త సంవత్సరం సముద్రంలోంచి లేచింది అంటే విష్వద్రేఖ మృగశిరలో వుండగా సంవత్సరారంభాన్నే సూచిస్తుంది. ఇక మిగిలిన కథాంశాలు కథ రమ్యత కోసం వ్రాయబడ్డాయి. ఈ కథలన్నీ క్రీ.పూ. 4000 ప్రాంతానివే.

ఇప్పుడు మరో కథ చూద్దాం.

✤ ✤ ✤

ఇంద్రుడి అదృశ్యం

త్వష్ట ప్రజాపతి కుమారుడు విశ్వరూపుడు అతనికి మూడు శిరశ్శులు. ఒక నోటితో తింటాడు. మరో నోటితో సోమపానం చేస్తాడు. మరోనోటితో వేదం చదువుతాడు. కారణాంతరాల వలన అతన్ని దేవతలు తాత్కాలిక గురువుగా స్వీకరించారు. అయితే అతను యజ్ఞాలు చేసేటప్పుడు హవిస్సులను దేవతలకు కాకుండా రాక్షసులకు అందించేవాడు. ఆ మోసంని గుర్తించిన ఇంద్రుడు వజ్రాయుధంతో విశ్వరూపుడి మూడు తలలనూ నరికేశాడు. అందుకు కోపించిన త్వష్ట హోమగుండం నుండి వృత్రుడనే రాక్షసుని సృష్టించి ఇంద్రుడి మీదకు పంపించాడు. అయితే వాడిని కూడా ఇంద్రుడు చంపేశాడు. దానితో ఇంద్రుడిని ఆవహించేందుకు బ్రహ్మ హత్యాపాతకం వెంటాడింది. అందువలన ఇంద్రుడు పారిపోయి మానసరోవరంలో దాక్కున్నాడు. అక్కడికి బ్రహ్మహత్యాపాతకం వెళ్ళ లేకపోయింది. ఇంద్రుడు యెక్కడికి వెళ్ళిపోయాడో తెలియక దేవతలందరూ తికమక పడ్డారు.

ఇది వేదంలోనూ, పురాణాల్లోనూ గల ఒక కథాసారం. కథాపరంగా కానీ, విజ్ఞానాంశం పరంగా కానీ యిందులో ఇంద్రుడి దోషం యేమీ లేదు. అయితే పిరికి పంద పారిపోయాడు అనే నింద మాత్రం వుంది. అయితే దీని అంతరార్థం గ్రహిస్తే ఆ నింద కూడా వుండదు. అందుకోసం అంతరార్థాన్ని గమనిద్దాం.

ఈ కథ విష్వద్రేఖ మృగశిరలో కొంతకాలం వుండి, ఆపైన మృగశిర నుండి ప్రక్కకు జరిగిపోయిన కాలంలో యేర్పడింది.

మృగశిర తారామండలంలో ముఖ్యమయిన నక్షత్రాలు మూడు కాంతి వంతంగా ఆకర్షనీయంగా కన్పింస్తుంటాయి (వాటినే మనవారు మృగశిరశ్శులో గుచ్చుకున్న శరము అనీ, గొల్లకావడి అనీ అంటుంటారు) ఆ మూడు తారలనే ఈ కథలో విశ్వరూపుని మూడు శిరశ్శులుగా వర్ణించారు. ఆ మూడు చుక్కల మీదుగా విష్వద్రేఖ వ్యాపించి వుండటాన్నే విశ్వరూపుని మూడు శిరశ్శులను ఇంద్రుడు ఖండించినట్లు చమత్కరించారు. నిజానికి ఇంద్రుడెవరి శిరశ్శులనూ ఖండించలేదు.

మృగశిర, ఆరుద్ర, మరికొన్ని తారల సమూహాన్ని ఒరయన్, నరకాసురుడు, నముచి, వృత్రాసురుడు....అంటూ అనేక విధాల ఖగోళ పండితులు వర్ణించారని చెప్పుకున్నాం కదా! ఈ కథలోని వృత్రాసురుడు ఆ తారాసమూహమే, అనగా విష్వద్రేఖ మృగశిర (శిరోభాగం) నుండి ప్రక్కకు జరిగిందనీ, అయినా వృత్రాసుర తారా మండలం లోనే వుందని చెప్పేందుకే ఆ ఋషులు ఆ వృత్రాసురవధ కథను చెప్పుకొచ్చారు.

అనగా ఇంద్రుడెవరినీ చంపలేదు. బ్రహ్మహత్యాపాతకం రాలేదు. మరి ఇంద్రుడే మయినట్లు?


ఒరయన్ దాటాక విష్వద్రేఖ రోహిణి మీదకు జరగాలన్నా లేక మరో క్రొత్త ధృవతార రావాలన్నా సుమారు వేయి సంవత్సరాలు పడుతుంది. ఈ మధ్యకాలంలో విష్వద్రేఖను గుర్తించటానికి సరైన ముఖ్యతార యేదీలేదు. మరి విష్వద్రేఖను గుర్తించేదెలా? విష్వద్రేఖ యెక్కడుంది? అని ఋషులు తికమక పడ్డారు. అదే ఇంద్రుని ఆచూకీ తెలియక దేవతలు కలత పడటంలోని అర్థం.

✣ ✣ ✣


నహుష చరిత్ర

ఇంద్రుడు కనపడకుండా పోయాడు. మరి స్వర్గాన్ని పాలించేదెవరు? ఇంద్రుడు లేకపోతే యజ్ఞాలు యెలా చేయాలి? ఇంద్రుడు తిరిగి వచ్చే వరకు యెవరయినా తాత్కాలిక ఇంద్రుడుగా వుండాలి. ఎవరిని నియమించాలి? అని ఆలోచించారు. నూరు అశ్వమేధ యాగాలు చేసి పుణ్యం సంపాదించిన నహుష మహారాజే అందుకు సమర్థుడని యెంచి, అతడ్ని తాత్కాలిక ఇంద్రుడిగా నియమించారు. సుమారు వేయి సంవత్సరాలు ఇంద్రపదవిలో వున్నాడు నహుషుడు. దానితో అతనిలో అహంకారం పెరిగిపోయింది. అహం, కామంతో కళ్ళు మూసుకుపోయి శచీదేవి పొందుకోరాడు. ఇంద్రపదవిలో వున్న నహుషుని ఎదిరించలేక భయపడింది శచీదేవి. చివరకు బృహస్పతి సలహా పై నహుషుడుకి కబురు పంపింది. నహుషుడు పల్లకీలో యొక్క సప్తఋషులు చేత పల్లకీని మోయించుకుంటూ వస్తే తాను వశమౌతానని చెప్పింది. సరేయని పల్లకీ ఎక్కాడు న హుషుడు. సప్తఋషులను పిలిచి పల్లకీ మోయమన్నాడు. (ఈ కథ మహాభారతంలో రెండు చోట్ల మరియు యితర గ్రంథాల్లోనూ వుంది. కథ సారం ఒక్కటేగానీ కొన్నికొన్ని మార్పులు మాత్రం వున్నాయి. ఒక్కొక్క చోట ఒక్కోలా వుంది. ఒకచోట సప్తఋషులే పల్లకీని మోసినట్లు వ్రాయబడగా మరోచోట సప్తఋషులతో పాటు యింకా వందలాది ఋషులు మోశారనివుంది. మరో గ్రంథంలో వారితో పాటు అగస్త్యుడు కూడా మోశాడని వ్రాయబడింది). మొత్తం మీద ఋషులు పల్లకీ మోయసాగారు. వారిని యింకా తొందరగా నడవమని తొందర చేశాడు నహుషుడు. పైగా "సర్ప... సర్ప..." అంటూ ఒక ఋషిని కాలితో తన్నాడు. (సర్ప అనగా "వేగంగా" అని ఒక అర్థం. "పాము" అని ఒక అర్థం వున్నాయి.) దానితో కోపం వచ్చిన ఆ ఋషి "ఋషులను కాలితో తన్నేంత పొగరా నీకు? నిజంగా నువ్వు యీక్షణమయే ఒక సర్పంగా మారి భూమిపై అడవిలో

పడివుండు" అని శపించాడు. (ఆ శపించిన ఋషి అగస్త్యుడు అని కొన్ని గ్రంథాల్లో వుంది.) ఎవరైతేనే శాపం తగిలింది నహుషుడికే. అప్పటికి కళ్ళు తెరచిన నహుషుడు ఆ ఋషి కాళ్ళ పై పడి బ్రతిమాలాడు. ధర్మరాజు వలన శాపవిమోచనం కలుగుతుందని ఆ ఋషి చెప్పాడు. నహుషుడు పాముగా మారిపోయాడు. కొంత కాలం తరువాత పాండవులు వన వాసంలో వుండగా భీముడ్ని పట్టిబంధించాడు పాము రూపంలోని నహుషుడు. అప్పుడు నహుషుడి ప్రశ్నలకు ధర్మరాజు సరైన సమాధానాలు చెప్పటంతో అతనికి శాపం తీరిపోయి మరల నహుషుడయ్యాడు. అదీ కథ.



అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లలో యిలా కన్పిస్తాయి



ఫిబ్రవరి నుండి జూలై వరకు యిలా కన్పిస్తాయి

అంతరార్థం : విష్వద్రేఖ ఒరయన్‌ని దాటిపోయాక దగ్గరలో ముఖ్యమయిన నక్షత్రం యేదీలేక విష్వద్రేఖ వునికి గుర్తించటం కష్టమయింది. తదుపరి

కాలంలో రాబోయే ధృవతార "తూబా" అని తెలుసుకానీ అది రావటానికి సుమారు వేయి సంవత్సరాలు పట్టవచ్చు. మరి యీ వేయి సంవత్సరాల పంచాంగం మాటయేమిటి? కాలమానం యెలా లెక్కించాలి? అసలయిన ధృవతార లేదు. కనీసం రాశి చక్రంలోని తారలయినా వీలుగా లేవు. అందువలన తాత్కాలిక ధృవతార అవసరమయింది. ఆ కాలంలో ధృవతార చక్రానికి వీలయినంత దగ్గర తార కోసం పరిశీలించారు. (బొమ్మలో గీయబడిన వృత్తరేఖయే ధృవతారా చక్రం. ఆ చక్రం మీదగానీ, అతి దగ్గరగా వున్న తారలు గానీ వరుసగా ధృవ తారలవుతాయి. భూమి యొక్క వుత్తర అక్షం యెల్లపుడూ యీ వృత్తరేఖకు సూటిగానే తిరుగుతూ వుంటుంది.) అప్పుడు తూబా కంటే ముందుగా వృత్తరేఖకు సమీపంలో వున్న ఒక తార యించుమించుగా ధృతారగా సరిపోతుంది. అదే నహుషుడనే తార. అందుకని ఆ నహుషతారనే తాత్కాలిక ధృవతారగా నిర్ణయించారు. ఆ తార ఆధారంగా విష్వద్రేఖ ఏర్పడింది. అందుకే నహుషుడు తాత్కాలిక ఇంద్రుడిగా పదవిలో కూర్చున్నట్లుగా పురాణగాధ ఏర్పడింది.

ఆ విధంగా సుమారు వేయి సంవత్సరాలూ ఆ తార ఆధారంగానే కాలమానం లెక్కించబడింది. అదే నహుషుడి వేయి సంవత్సరాలు స్వర్గ పరిపాలనలోని ఆంతర్యం. వేయిసంవత్సరాలు గడిచే సరికి తూబా ధృవస్థానానికి వస్తుంది. నహుషతార ప్రక్కకి జరిగిపోతుంది. అంటే ఇంద్ర పదవి నుండి నహుషుని తప్పించి అసలు ఇంద్రుడిని కూర్చోబెట్టాలి. దానికి యేదో ఒక కారణం కావాలి. అందుకే నహుషుడి కథ మరింత పొడిగించారు. వేయేళ్ళుగా నహుషునిలో లేని కామం హఠాత్తుగా శచీదేవిపై పుట్టింది. శచీదేవిని ఆశించాడు నహుషుడు. సప్త ఋషులచే మోయబడే పల్లకీలో రమ్మని కోరింది శచీదేవి. (ఇక్కడొక విషయం చెప్పాలి. శ్రీమద్భాగవంతంలో... ఇంద్రుడు స్వర్గపాలన చేసే కాలంలో అప్పుడప్పుడు ఇంద్రుడెక్కిన పల్లకీని సప్తర్షులు మోసే వారనీ, అలాగే నహుషుడ్ని కూడా చాలాసార్లు సప్తర్షులు పల్లకీలో మోసేవారనీ వ్రాయబడింది. దీని భావం

యేమిటంటే ధృవతారగా లేక తత్కాలిక సహాయక ధృవతారగా యే నక్షత్రం వున్నా, దాని చుట్టూ సప్తర్షి మండలం ప్రదక్షణలు చేస్తూనే వుంటుంది. అలా తిరిగేటప్పుడు ఆ ధృవతారకు క్రింది భాగంలో సప్తర్షి మండలం వున్న సమయంలో సప్తర్షులు ఇంద్రపల్లకీ మోస్తున్నట్లుగా అభివర్ణించారు. బొమ్మలో చూడండి. సప్తర్షి మండలం ఆకారం పల్లకీ+పల్లకీ బొంగులా వుంటుంది. దానికి పై భాగంలో ధృవతార వుంటుంది. అదే ఇంద్ర పల్లకీని సప్తఋషులు మోస్తున్నారని చెప్పటంలో అంతరార్థం.) ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నుండి జూలై వరకు నహుష నక్షత్రానికి క్రింద భాగాన సప్తర్షి మండలం పల్లకీ ఆకారంలో కనిపిస్తుంది. చూడండి.

ఆ విధంగా నహుషుడెక్కిన పల్లకీని సప్తఋషులు మోశారని కథలో చెప్పారు. వారేకాక యింకా యెందరో ఋషులూ మోశారని కొన్ని గ్రంథాలంటున్నాయి. అనగా సప్తర్షి మండలానికి దరి దాపుల వున్న యితర నక్షత్రాలనే అలా వర్ణించి వుంటారు. ఆ తదుపరి నహుషుడు ఋషులను అదిలించటం... తన్నటం... అన్నీ కథాలంకారాలు.

ఇక శపించిన ఋషి అగస్త్యుడు అని కొన్ని గ్రంథాలు చెబుతున్నాయి. కానీ నిజానికి సప్తఋషులలో గాని, ఆ దరిదాపులలోగానీ అగస్త్యుడు అనబడే నక్షత్రం యేదీ లేదు. అగస్త్యుడనబడే నక్షత్రం దక్షిణ దిశ ఆకాశంలో "సిరియస్" తారకు దగ్గరలో వుంది. ధృవతార ఉత్తరాకాశంలో వుంటుంది. అగస్త్యుడు దక్షిణాకాశంలో వుంటాడు. అనగా రెండూ ప్రత్యర్థి తారలు అన్నమాట. ఆకాశంలో తూర్పు, పడమరలుగా గానీ ఉత్తర దక్షిణాలుగా గానీ ఎదురెదురు తారలను ప్రత్యర్థి తారలు అంటారు. అందువల్లనే నహుషుడ్ని ప్రత్యర్థి అయిన అగస్త్యుడు శపించినట్లుగా చెప్పబడింది. శాప ఫలితంగా నహుషుడు మహాసర్పంగా మారిపోయాడు కదా! నహుషతార మొదవలుకొని మిగిలిన మొత్తం డ్రాకోరాశిని చూడండి మహాసర్పాకారంలో లేదూ! అదే సర్పంగా మారిన నహుషుడు. అప్పుడు

తూబా ధ్రువతార కావటంతో ఇంద్రుడు మరల స్వర్గాధిపతి అయినట్లుగా చెప్పబడింది.

అదీ ఆకాశంలో జరిగిన నహుషుడి గాథ.

ఇక్కడ మరో చిన్న విషయం చర్చించి ముందుకు వెళ్దాం.

కొందరు పండితులు ఈ డ్రాకో మండలాన్ని నహుషుడని గుర్తించగా మరి కొందరు ఆధునిక పండితులు దక్షిణాకాశంలోగల "హైడ్రా" అనే సర్పాన్ని నహుషుడనీ, యీ "డ్రాకో"ని నరకాసురుడనీ వర్ణించారు. కానీ యీ ఆధునిక పండితుల వాదం పూర్తిగా తప్పు.

ఎందుకంటే నరకాసురుడు రాక్షసుడు. డ్రాకో అంటే మహాసర్పం. రెండూ ఒక్కటి యెలా అవుతుంది? పోనీ దరిదాపుల్లో సత్యభామ, శ్రీకృష్ణుడు, గరుత్మంతుడూ యెవ్వరూలేరు. మరి డ్రాకోని నరకాసురుడని యెల అంటాం?

ఇక హైడ్రా సంగతి చూద్దాం. ఈ హైడ్రా అనే పెద్ద పాము కర్కాటకరాశికి చెందిన ఆశ్లేష నుండి తులారాశికి చెందిన స్వాతి వరకూ దక్షిణాకాశంలో వ్యాపించి వుంటుంది. స్వాతికి అధిదేవత వాయుదేవుడు. అందువలన హనుమంతుడు లేక భీముడు కూడా స్వాతి సంబంధీకులేనని కొందరు పండితులంటారు. అందువలన యీ హైడ్రా స్వాతి వరకూ వుంది కనుక భీముడ్ని మింగ చూసిన నహుషుడు హైడ్రాయే అనేది పైన చెప్పిన ఆధునిక పండితుల వాదం.

కానీ హైడ్రా యొక్క శిరస్సు స్వాతికి వ్యతిరేక దిశలో యెక్కడో కర్కాటకరాశి వద్ద వుంది. హైడ్రా తోక మాత్రం స్వాతికి సమాంతరంగా వున్నా చాలా దూరంలో వుంటుంది. అందువలన హైడ్రా స్వాతిని మింగ చూసే అవకాశమే లేదు.

విష్వద్రేఖకి అధిదేవుడు ఇంద్రుడు. ఆ రేఖకి మూలం ధృవతార కనుక అదే ఇంద్రపదవి. ధృవతారలు ఉత్తరాకాశంలో వుంటాయి. హైడ్రా

దక్షిణాకాశంలో వుంది కనుక హైడ్రా ఇంద్రపదవి నలంకరించే అవకాశం లేనే లేదు. ఆ అవకాశం కేవలం డ్రాకోకి మాత్రమే వుంది.

నహుషుడ్ని పల్లకీలో వుంచి మోసినవారు సప్తఋషులు, సప్తఋషీ మండలం డ్రాకో ప్రక్కనే వుంది కానీ హైడ్రాకి దరిదాపుల్లో లేరు.

హైడ్రాకి సమీపంలో వున్న మఖ నక్షత్రాలు పల్లకీ ఆకారంలో వుంటాయని కొందరు పండితుల భావన. అందువలన నహుషుడు యెక్కిన పల్లకీ అదే అని యీ పండితుల వాదం.

పల్లకీ అదే అయితే మోసేందుకు మఖ వద్ద సప్తఋషులేరీ? మరియు డ్రాకో లోని నహుషతార కనీసం సంవత్సరంలో మూడు, నాలుగు నెలలు సప్తర్షీ మండలానికి పై భాగంలో వుంటుంది. కనుక సప్తర్షుల పల్లకీ ఎక్కినట్లు వర్ణించవచ్చు. కానీ హైడ్రా మాత్రం యేనాడూ మఖ తారలకుపై భాగాన వుండే అవకాశం లేదు. ఎల్లకాలమూ మఖ తారలు ఆకాశ మధ్యంలోనూ హైడ్రా దక్షిణ దిశగా వుంటాయి. (అంటే మఖ పల్లకీని హైడ్రా మోస్తుంది కానీ హైడ్రాని మఖ మోసే వీలులేదు.)

ఇంకా సంవత్సరంలో కొన్ని నెలలు పాటు డ్రాకో యొక్క శిరశ్శు స్వాతి తారపై వురికేలా స్వాతివంక తిరిగి వుంటుంది కూడా.

ఇటువంటి అనేక కారణాల రీత్యా డ్రాకో యే న హుషుడని, హైడ్రా కాదని ఋజువౌతుంది.

ఆ విధంగా విష్వద్రేఖ తూబా నక్షత్రం వద్దకు చేరిన విధానాన్ని మన ఋషులు మనకు తెలియజేశారు.

తూబా తరువాత ధృవస్థానంలోకి వచ్చే తార... నేటి మన ధృవతారయే. ఆ విషయాన్ని కూడా మన ఋషులు వేల సంవత్సరాల పూర్వమే కనుగొని ముందే ఆ వివరాలను వ్రాసి పెట్టారు. అదే మన పురాణాలలోని ధృవచరిత్ర.

✣ ✣ ✣

ధృవ చరిత్ర

ఉత్తానపాదు డనే రాజుకు ఇద్దరు భార్యలు. పెద్దభార్య సునీతి కుమారుడు ధృవుడు. చిన్నరాణి సురుచి కుమారుడు ఉత్తముడు. రాజుకు చిన్నరాణి పై తగని ప్రేమ. అది అలుసుగా తీసుకుని తన సవతి కుమారుడైన ధృవుణ్ణి తండ్రితో కలువనీయకుండా లాగి పారేసి దుర్భాషలాడి అవమానపరచింది. ఏడుస్తూ తల్లి దగ్గర కెళ్ళి చెప్పుకున్నాడు ధృవుడు. నీకు ఆ నారాయణుడే దిక్కు ఆయనే కాపాడాలి అంది సునీతి. వెంటనే ఇల్లువిడిచి వెళ్ళిపోయాడు. ఐదేళ్ళ వయస్సుగల ధృవుడు. దారిలో నారదుడు కనిపించి నారాయణ మంత్రం వుపదేశించాడు. దట్టమైన అడవిలో ఘోరమైన తపస్సు చేశాడు ధృవుడు. శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై ఒకవరం యిచ్చాడు. అదేమంటే భవిష్యత్తులో ధృవుడు ఆకాశంలోని ధృవస్థానం అలంకరిస్తాడనీ అపుడు సూర్య, చంద్రులు సప్త ఋషులు, గ్రహతారకలు నిత్యం అతని చుట్టూ ప్రదక్షణ చేస్తారనీ... అటువంటి ధృవస్థానం 26 వేల సంవత్సరాలకొకసారి కొంతకాలం చొప్పున ప్రాప్తించునని వరం యిచ్చాడు. అంతవరకు ఇంటికిపోయి తండ్రి తరువాత రాజ్యాన్ని ఏలుకోమని ఆదేశించాడు నారాయణుడు. అలాగే నంటూ ఇల్లు చేరాడు ధృవుడు. తండ్రి, తల్లులు, తమ్ముడు యెంతో ఆదరించారనతన్ని. తండ్రి అనంతరం ధృవుడు పట్టాభిషిక్తుడై సుమారు మూడువేల సంవత్సరాలు రాజ్యపాలన చేసి ఉత్తరాకాశంలో ధృవస్థానం అలంకరించాడు. అదే యినాటి మన ధృవనక్షత్రం.

ఈ కథ శ్రీమద్భాగవతంలో ధృవ చరిత్ర పేరుతో వ్రాయబడివుంది.

ఈ కథలో మనం గుర్తించవలసిన విశేషాలు రెండున్నాయి.

1. ఈ కథ క్రీ.పూ. 3000 కి పూర్వం వ్యాసమహర్షి వ్రాశాడు. ఆ కాలంలో ధృవతారగా తూబా వుండేది. సహజంగా అంతవరకు అనేక

వేల యేళ్ళ నుండి యే కాలంలో యే తార ధృవతారగా వుంటుందో ఆ కాలంలో ఆ తారకు సంబంధించిన కథలు పురాణాలలో వ్రాయబడేవి అనే విషయం యింత వరకు మనం చర్చించు కున్నాం. కానీ ఈ ధృవ చరిత్ర మాత్రం అడ్వాన్సుగా కొన్ని వేల సంవత్సరాల ముందే వ్రాయబడింది. రాబోయే కాలంలో యే నక్షత్రం ధృవస్థానంలోకి వస్తుందో ముందే లెక్కలు కట్టిన మేధావి వేదవ్యాసుడు. అందుకే ముందుగానే యీ కథను వ్రాసి భాగవతంలో చేర్చాడు. ఆ కాలంలో భూమిపై జరిగిన ఒకరాజు, ఇద్దరు రాణులు, ఇద్దరు కుమారుల కథలను తీసుకుని దానికి ధృవతారా విజ్ఞాన విషయాలను ముడివేసి వ్రాసిన భగవతగాధ యీ ధృవ చరిత్ర. ఈ కథ వ్రాయబడిన కాలానికి 3000 సంవత్సతరాల అనంతరం నేటి ధృవతార ధృవ స్థానంలోకి వస్తుందని గ్రహించిన వ్యాసుడు ఆ విషయాన్ని కథ ద్వారా మనకు యెలా అందించాడో గమనించారా? ఇంటికి వెళ్ళి తన తండ్రి రాజ్యానికి పట్టం కట్టుకుని 3000 సంవత్సరాలు పరిపాలించాక ధృవస్థానాన్ని అలంకరించాడు ధృవుడు. చాలా తెలివిగా వ్రాశాడు కదా! (నిజానికి యెవరైనా 3000 యేళ్ళు జీవించగలరా? అయినా 3000 వేల యేళ్ళ అనంతరం ధృవతార మారబోతుందని గ్రహించటం వల్లనే ఆ విధంగా వ్రాశాడు. ఇక్కడ మరో చిన్నమాట చెప్పాలి. ఏమిటంటే ఈ 3000 అనే సంఖ్యను కొన్ని గ్రంధాలలో 30000 యేళ్ళు అని కొందరు వ్రాశారు. అది తప్పు. వ్యాసుడి కాలానికి 30000 కలిపితే... ఈ నాటికీ యింకా ధృవుడు ధృవతారగామారలేదనుకోవాలి. మరో 25000 యేళ్ళకు గానీ ధృవుడు ధృవస్థానంలోకి రాడుకదా! అందువలన ఆ సంఖ్య మూడు వేల యేళ్ళు అనేదే నిజం)

2. ఈ కథలో విష్ణువు యిచ్చిన వరంలో 26000 యేళ్ళకొకమారు కొంతకాలం ధృవస్థానంలో ధృవుడు వుంటాడని చెప్పాడు. నేటి ఆధునిక శాస్త్రవేత్తల లెక్క ప్రకారం విష్వచ్ఛలనం వలన ధృవతారా చక్రం ఒక రౌండు పూర్తికావటానికి పట్టేకాలం సుమారు 26000 యేళ్ళు. ఈ విష్వచ్ఛలన

రహస్యం క్రీ.పూ. 150 వరకూ ప్రపంచంలో యితర దేశీయులెవరికీ తెలియదు. క్రీ.పూ. 150లో హిప్పార్చస్ అనే పాశ్చాత్య శాస్త్రవేత్త ఈ విషయాన్నికనుగొన్నాడని ప్రపంచమంతా నమ్మింది. కానీ క్రీ.పూ. 3000కు పూర్వమే మన వేదవ్యాసుడు ఈ 26000 సంవత్సరాల రహస్యాన్ని మనకు అందించాడు. చూశారా మన ప్రాచీన ఋషుల గొప్పదనం.

* * *


దక్షయజ్ఞం

ఆ విధంగా అభిజిత్ నుండి నేటి ధృవతార వరకు విష్వద్రేఖాచలనాన్ని ఇంద్ర కథల మాటున తెలియచేస్తూ వేదపురాణాలలో యేన్నో కథలనందించారు. మన ప్రాచీన ఋషులు. అయితే అన్ని కథల్లోనూ ఇంద్రుడి ప్రమేయం మంచిగానో చెడ్డగానో కనిపిస్తుంది కానీ ఈ ధృవ చరిత్రలో మాత్రం ఇంద్రుడి పాత్ర చేర్చబడలేదు. అలాగే ఇంద్ర పాత్ర లేని మరోకథ యీ దక్షయజ్ఞం. ఈ కథ వేదాల్లోనూ, పురాణాల్లోనూ కూడావుంది. ఈ కథ కూడా విష్వద్రేఖాచలనాన్నే సూచిస్తుంది. కానీ కేవలం ఒక రాశి గూర్చికాదు. సిరియస్ నుండి మేషరాశి వరకూ విష్వద్రేఖ ప్రయాణాన్ని గూర్చి పరిశీలించిన ఋషి దక్షయజ్ఞగాథను ఆకాశవీధిలో చూపించాడు. ఆ విషయాన్ని క్లుప్తంగా యిక్కడ చరిద్దాం. దాని పూర్తివివరాలు కావాలంటే మా "పురాణగాథల్లో సైన్సు అద్భుతాలు" పుస్తకంలో చూడండి.

ఆహ్వానం లేకపోయినా దక్షయజ్ఞానికి వచ్చింది సతీదేవి. కోపంతో ఆమెపై విరుచుకు పడ్డాడు దక్షుడు. ఆ అవమానం భరించలేక హోమగుండంలో దూకింది. సతీదేవి. ఆ విషయం తెలిసిన శివుడు కోపించి, వీరభద్రుని పంపించాడు. కుక్క వాహనంపై నెక్కి వెళ్ళిన వీరుభద్రుడు ఆ దక్షుడి తల నరికి హోమగుండంలో పడేశాడు. అందరికోరికపై దక్షుణ్ణి మళ్ళీ బ్రతికించాడు శివుడు. అయితే దక్ష శిరశ్శు హోమగుండంలో బూడిదైపోయినందున ఒక గొర్రె శిరశ్శును దక్షిడికి తగిలించారు. అదీ

క్లుప్తంగా కథ. ఈ కథను ఆకాశంలో చూపిస్తాను చూడండి. ఆకాశంలో "ఒరయన్' అని పాశ్చాత్యులు పిలిచే తారా సమూహమే దక్షుడు (మృగశిర+ఆరుద్ర తారలు) వాటి ప్రక్కనే వున్న రోహిణి తారలే సతీదేవి. ఒరియన్ (దక్షుడు) ఒంటికాలిపై లేచి రోహిణి తారలపై విరుచుకు పడుతున్నట్లు కన్పిస్తాయి. చూడండి రోహిణి ప్రక్కనే కృత్తికా తారలున్నాయి. అవి అగ్నిశిఖల ఆకారంలో వుంటాయి పైగా ఆ తారల అధిదేవుడు అగ్నిదేవుడే అందుకే దాన్నే హోమగుండంగా వర్ణించారు. దక్షశిరశ్శు, సతీదేవి పడి భస్మమయింది యీ అగ్నిలోనే. దక్షుణ్ణి నరికిన వీరభద్రుడెవరు? ఒరయన్‌కి ఆగ్నేయదిశగా చూడండి "సిరియస్" అనే కాంతివంతమైన తార+మరికొన్ని తారలు కలిసి ఒరయన్ మీదకు దూకుడుగా పరిగెడుతున్న కుక్క ఆకారంలో వుంటాయి. అదే కుక్క వాహనం కల వీరభద్రుడు. ఆ విధంగా దక్షుడు (ఒరయస్) సతీదేవిని (రోహిణి) తిట్టడం, సతీదేవి అగ్నిలో (కృత్తిక) దూకటం, వీరభద్రుడు (సిరియస్) దక్షుని (ఒరయన్) దండించటం అన్నీ చూశారుగా. విష్వద్రేఖ అలా అలా ఆ రాశుల మీదుగా జరిగి జరిగి చవరికి మేషరాశిలో చేరింది. అదే దక్షుడికి మేషశిరశ్శును తగిలించటంలో భావం.

అక్కడితో ప్రస్తుతకాలానికి వచ్చేశాం.



1. మృగవ్యాధ
2. దక్షుడు (మృగశిర)
3. సతీదేవి (రోహిణి)
4. అగ్ని (కృత్తిక)
5. గొర్రె (మేషం)
6. విష్వద్రేఖ

అయినా ఆగకుండా ఇంకాముమ్ముందు జరిగే మార్పులను కూడా కొన్నింటిని లెక్కించి చూచాయగా మహాభారతంలో అందించాడు వ్యాసుడు. అదీ క్లుప్తంగా చూద్దాం.

❖ ❖ ❖

యయాతి కథ

యయాతి మహారాజుకు ఇద్దరు భార్యలు. పెద్దభార్య దేవయానికి ఇద్దరు కుమార్లు, చిన్నభార్య శర్మిష్ఠకు ఇద్దరు కుమార్లు. శాపవశాన వార్థక్యం వచ్చింది యయాతికి. తన వార్థక్యాన్ని కొంతకాలం పాటు తీసుకుని తనకు వారి యవ్వనాన్ని యిమ్మని నలుగురు కొడుకులనూ అడిగాడు. పెద్దవారు ముగ్గురు యివ్వలేమని చెప్పారు. చివరి వాడైన (శర్మిష్ఠ కుమారుడు) పూరుడు మాత్రం తన యవ్వనాన్ని తండ్రికి యిచ్చి, తాను వార్థక్యాన్ని తీసుకున్నాడు. కొంతకాలం పాటు యయాతి అనేక సుఖాలనుభవించాడు. ఎన్నోపుణ్య కార్యాలు, అశ్వమేధాది యాగాలు చేశాడు. అపుడు మరల పూరుని యవ్వనాన్ని పూరుడికి యిచ్చి తన వార్థక్యాన్ని తీసుకున్నాడు. తన అనంతరం సకల రాజ్యాన్ని పూరుడికే యిచ్చేశాడు.

యయాతి చేసిన పుణ్యకార్యాలకు మెచ్చుకున్న ఇంద్రుడు యయాతికి స్వర్గవాసాన్ని ప్రసాదించాడు. స్వర్గం చేరిన యయాతి చాలాకాలం సుఖంగా జీవించాడు. కొంత కాలానికి అతనిలో అహంకారం పెల్లుబికింది. అది గమనించిన ఇంద్రుడు అతన్ని స్వర్గం నుండి బహిష్కరించాడు. స్వర్గాన్ని విడిచిన యయాతి పితృలోకాలకు వెళ్ళి కొంతకాలం నివసించాడు. తనలో కలిగిన అహంకారానికి పశ్చాత్తాపంచెంది మరల పుణ్యమార్గాన జీవించటం చూసి ఇంద్రుడు మరల స్వర్గానికి ఆహ్వానించాడు. స్వర్గం చేరిన యయాతి మరికొంత కాలం సుఖంగా జీవించాడు.

అది క్లుప్తంగా యయాతి కథ. అందులో పూరుడియవ్వనాన్ని తిరిగి యివ్వటం వరకూ జరిగిన కథంతా భూమిపై జరిగినదే. ఇంద్రుడు స్వర్గానికి

తీసుకువెళ్ళటం నుండి చెప్పబడిన కథమాత్రం ఆకాశంలో విష్వద్రేఖాచలనం గురించి చెప్పటానికి వ్యాసుడు వ్రాసిన కథ, అదేమిటో చూద్దాం.

సప్తర్షి మండలానికి పశ్చిమ దిశలో కొంత దూరంలో ఒక నక్షత్రరాశి వుంది. దానిని పాశ్చాత్యులు పెర్సియస్ అంటారు. దానినే మన వారు కొందరు హిందూ ఋషులు యయాతి అన్నారు. దానికి మరికొంత దూరంలోవున్న తారా సమూహాన్ని పాశ్చాత్యులు కాసియోపియా అన్నారు. మనవారు శర్మిష్ఠ అన్నారు. ఈ రెండు రాశుల మధ్యలోవుండే "ఆంద్రోమిడా" రాశినే మనవారు దేవయాని అన్నారు. శర్మిష్ఠరాశి ఇంగ్లీష్ అక్షరం "ఎమ్"లా వుంటుంది. అలా ధనస్సు ఆకారంలో వుండటం వలన కొందరు హిందూ పండితులు దానిని రామబాణం అనీ, రాముడి గుర్తుగా కూడా వర్ణించారు. ఆ శర్మిష్ఠ క్రింది భాగంలో గల తారా సమూహాన్ని పాశ్చాత్యులు సెఫియస్ అనీ మనవారు పూరుడు అనీ అంటారు.

కొందరు ఆధునిక పండితులు మాత్రం ఈ రాశులను వేరేగా వూహించారు. పెర్సియస్‌ను భృగువు అనీ, కాసియోపియాను అప్సరసలనీ, సెఫియస్‌ని యయాతి అనీ చెబుతున్నారు. కానీ అవి వారి స్వంతవూహలు, రచనలుగానే అనిపిస్తున్నాయి.


మన ధృవుడి తరువాత ధృవస్థానం పొందే నక్షత్రం సెఫియస్ (పూరుడు) రాశిలోని మొదటి తార. అది ధృవతారా చక్రానికి అతి సమీపంలో వుంటుంది. అందువలన క్రీ.శ. 5000 ప్రాంతంలో కాబోయే ధృవతార అదే. అంటే మన ధృవతారకు, రాబోయే ధృవతారకూ మధ్య సుమారు 2500 సంవత్సరాల ఖాళీ వుంది. ఆ ఖాళీ కాలంలో విష్వద్రేఖ వునికిని గమనించటం కోసమే వ్యాసుడు యీ పెర్సియస్‌ని (యయాతి) సూచించాడు. అయితే ఆ రాశి ధృవతారా చక్రానికి దూరంగా వుండటం వలన ధృవతారగా కానీ తాత్కాలిక ఉపధృవ తారగా కానీ చెప్పటానికి వీలుకాదు. అందుకే యయాతి ఇంద్రపదవి అలంకరించలేదు కానీ

ఇంద్రునితో సహవాసం చేసినట్లుగా చెప్పబడింది. విష్వద్రేఖ పెర్సియస్‌లోని మొదటి తారతో కలిసి వుండే కొన్నివందల యేళ్ళు యయాతి స్వర్గావాస కాలంగా చెప్పబడింది. ఆ తార నుండి విష్వద్రేఖ ముందుకు జరిగిపోయిన కాలంలో యయాతి స్వర్గభ్రష్టుడై పితృ లోకంలో వున్నాడు అనీ, మరల పెర్సియస్‌లో తచివరి తార మీదుగా విష్వద్రేఖ వున్న కాలం మరల యయాతి స్వర్గవాసం చేసిన కాలంగా చెప్పబడింది. అనంతరం మరికొన్ని వందల యేళ్ళకు విష్వచ్ఛలనం మూలంగా సెఫియస్‌లోని ప్రథమతార ధృవస్థానంలోకి వస్తుంది.

ఆ విధంగా ఆకాశంలో తారా విజ్ఞానం, విస్వద్రేఖాచలనం తెలిపే ఇంద్రకథలు. యేర్పడ్డాయి.

అయితే అలాంటి విజ్ఞానగాథలే కాకుండా మామూలు ఇంద్రగాథలు, ఆధ్యాత్మికమైన పురాణగాథలు కూడా వున్నాయి. వాటి విషయం కూడా క్లుప్తంగా చూద్దాం.

యయాతి కథలో కూడా ఇంద్రుడు మంచి వాడిగానే వున్నాడు కదా! ఇక కొన్ని పురాణగాథలను పరికిద్దాం.



వేదాలను విమర్శించే కొందరు మూర్ఖులు ఇంద్రుడు పశువుల కోసం యుద్ధాలు చేసేవాడనీ, అతని యుద్ధతంత్రం అనాగరికమైన దొంగచాటు దెబ్బయనీ, చరిత్రలో చెప్పబడిన ఆర్యుల నాయకుడే ఇంద్రుడనీ... నోటి కొచ్చినట్లు వ్రాసి పడేశారు. కానీ ఇంద్రుడంటే దేవతల రాజు అని వేదాల్లో ఖచ్చితంగా వుంది. వేదాలను సరిగా పరిశీలించనివారు, పరిశీలించినా అర్థం చేసుకోలేనివారు చేసిన విమర్శలవి. ఈ విమర్శకు జవాబు మా "శులభశైలిలో వేదవిజ్ఞానం" పుస్తకం పేజీ 237లో చూడండి.

✣ ✣ ✣

ఇంద్రుడు దుర్మార్గుడా?

ఇంద్రుడు ఎల్లవేళలా మదువు త్రాగుతూ అప్సరసలతో ఆడుతూవుండే దుర్మార్గుడిగా చాల మంది ఆస్తికులు కూడా భామిస్తుంటారు. ఎందుకంటే సోమరసం అనగా మధువు అని చాలమంది భ్రవిస్తుంటారు. ఋగ్వేదం 10-34-1లో "సోమస్యేవ మేజవ తస్య భక్షో విభేదకో జాగృవిర్మహ్యామచ్ఛాన్" అనివుంది. నిజమే. కానీ సోమరసం వేరు. మధువువేరు. యజ్ఞసమయాల్లో యాజ్ఞికులు సమర్పించే సోమరసాన్ని ఇంద్రుడు, దేవతలు సేవిస్తారు. అలాంటి వివరాలను అందించే కొన్ని వేద, పురాణకథలను అపార్థం చేసుకున్నవారు యిలాంటి భ్రమలకు లోనౌతారు. ఉదాహరణకు ఒక వేద కథను చూద్దాం.

సోమపానం :

ఇది శతపథ, తలవకార బ్రాహ్మణాల్లో వుంది.

ఋషులు చైత్రపౌర్ణమి నుండి అరంభించిన అగ్ని చయనయాగంలో విరివిగా అర్పించే సోమరసాన్ని బాగా త్రాగిన ఇంద్రుడు ఆరోగ్యం చెడి, బానవలె పొట్టపొంగిపోయి బాధపడతాడు. దానిని ఇంద్రుడికి జలోదరవ్యాధి వచ్చిందన్నారు.

అప్పుడు సౌత్రామణ అనే మరోయాగం చేస్తారు (వర్షాకాలారంభంలో ప్రారంభిస్తారు). ఆ యాగం వలన ఇంద్రుడి పొట్టలోని సోమరసం తిరిగి బయటకు కారిపోయి మామూలుగా అవుతాడు.

ఈ కథల భావం యేమిటంటే... వేసవికాలంలో భూమి మీద జలాశయాల్లో నీరు ఎండతీవ్రతకు ఆవిరై మేఘాలుగా మారి నీటితో నిండి వుంటాయి. అదే ఇంద్రుని పొట్ట సోమరసంతో నిండి జలోదర వ్యాధి రావటంలో అర్థం. దానినే అగ్నిచయన యాగం అంటారు. మరల ఆ నీరు అంతా వర్షాకాలంలో నీరుగామారి వానలు కురియటమే సౌత్రామణి యాగం. వర్షాలకు ఇంద్రుడు అధిపతి కనుక యీ కథల్లో ఇంద్రుని పాత్ర యిరికించబడింది. అంతేకాని ఇంద్రుడు త్రాగుబోతుకాదు. అతనికి యే రోగం రాలేదు.

ఇలాంటివే వేదాల్లో వైశ్వదేవం, వరుణప్రఘూస వంటి యాగాలు వ్రాయబడ్డాయి. వాటి అర్థాలు కూడా యిలాంటివే. (పూర్తి వివరాలకు మా "శులభశైలిలో వేద విజ్ఞానం" చదవండి.)

✤ ✤ ✤

దధీచి కథ

పూర్వం దధీచి అనే మహర్షి వుండేవాడు. ఆ రోజులలో ఇంద్రాది దేవతలకు రాక్షసులకు యుద్ధం వచ్చింది. దేవతలు విజయం సాధించారు. ఆ యుద్ధంలో వుపయోగించిన దివ్యాయుధాలను దధీచికి యిచ్చి దాచి వుంచమనీ మరల తాము కోరినపుడు యివ్వమనీ కోరాడు ఇంద్రుడు. అలాగే నన్నాడు దధీచి. అయితే రాక్షసులకు తెలియకుండా వాటిని యెక్కడదాచాలో తెలియంలేదు. దధీచి తన యోగశక్తితో ఆ ఆయుధాలన్నింటినీ మ్రింగేసి తన శరీరంలోనే దాచేశాడు. చాలాకాలం

వరకు ఇంద్రాదులు రాలేదు. ఈ లోగా ఆ ఆయుధాలన్నీ దధీచి గర్భంలో జీర్ణమయిపోయి వాటి అద్భుత శక్తి దధీచి యెముకలలో చేరిపోయింది.

తదుపరి కాలంలో వృత్రాసురుడితో యుద్ధం వచ్చింది ఇంద్రుడికి. అప్పుడు ఆయుధాలకోసం దధీచి వద్దకు వెళ్ళాడు. అప్పటికే ఆయుధాలు జీర్ణమయ్యాయి కదా! అందుకే దధీచి ప్రాణత్యాగం చేసి తన శరీరాన్ని ఇంద్రుడికి యిచ్చేశాడు. దేవశిల్పి విశ్వకర్మ వచ్చి దధీచి ఎముకలతో అద్భుతమైన ఆయుధాలను తయారు చేశాడు. వాటిలో ముఖ్యమైనవి నాలుగు.

1. శారంగం అనే ధనస్సు. దానిని శ్రీహరి తీసుకొని శారంగపాణి అయ్యాడు.
2. పినాకం అనే ధనస్సు. దానిని శివుడు తీసుకొని పినాకపాణి అయ్యాడు.
3. గాండీవం అనే ధనస్సు. దానిని అగ్నిదేవుడు తీసుకున్నాడు.
4. దధీచి వెన్నెముకతో మలచబడిన వజ్రాయుధం. దానిని ఇంద్రుడు తీసుకుని వృత్రాసురుడ్ని చంపేశాడు.

దధీచి కథ అంతరార్థం, వజ్రాయుధ అంతరార్థం, వృత్రాసురగాథల అంతరార్థాలు "పురాణగాథల్లో సైన్సు అద్భుతాలు", "శులభశైలిలో వేదవిజ్ఞానం"అనే మా పుస్తకాల్లో వ్రాశాం. చదవండి.

✤ ✤ ✤

శ్రీ కృష్ణుడితో విరోధం

ఇంద్రుడు రెండుమార్లు శ్రీకృష్ణుడితో విరోధం పెట్టుకున్నట్లు కొన్ని పురాణగాథ లున్నాయి. ఒకసారి వాటిని పరిశీలిద్దాం.

ప్రతి యేట గొల్లలందరూ ఇంద్రుడికి పూజలు చేసేవారు. కానీ ఒకసారి బాలకృష్ణుడు ఆ పూజకు అడ్డుపడి ఇంద్రుని బదులుగా గోవర్థన గిరిని పూజించ మన్నాడు. గొల్లలు అలాగే చేశారు. అందుకు కోపించిన

ఇంద్రుడు పిడుగులు, రాళ్ళతో కూడిన కుంభవృష్టి కురిపించాడు. గొల్లలకు దిక్కులేకుండా పోయింది. అప్పుడు శ్రీకృష్ణుడు గోవర్ధన గిరిని చిటికెన వ్రేలుపై నిలిపి గొల్లలను, గోవులను గోవర్ధనగిరి నీడలో వుంచి రక్షించాడు. వరుసగా ఏడురోజులు అలా వర్షం కురిపించి ఓడిపోయిన ఇంద్రుడు శ్రీ కృష్ణుడ్నే శరణు వేడాడు.

అలాగే మరోసారి శ్రీకృష్ణుడు పారిజాత వృక్షాన్ని స్వర్గం నుండి తీసుకు పోతున్నప్పుడు శ్రీకృష్ణుని ఎదిరించి ఓడిపోయిన ఇంద్రుడు మరల శ్రీ కృష్ణుడ్నే శరణు కోరాడు.

అయితే ఈ సంఘటనల్లోనూ ఇంద్రుడి దోషంలేదు. ఎందుకంటే శ్రీకృష్ణుడి గొప్పదనాన్ని, మహత్యాలను లోకానికి చాటి చెప్పేందుకు ఆడిన జగన్నాటకాలవి. అలాంటి ఒక నాటంలో బ్రహ్మదేవుడూ పాల్గొన్నాడు. ఒకసారి శ్రీ కృష్ణుడితో కలసి అడివిలోకి గోవులను తోలుకెళ్ళిన గోపాలురను, గోవులతో సహా బ్రహ్మదేవుడు దాచేశాడు. అప్పుడు శ్రీ కృష్ణుడు తానే అందరు గోపబాలురుగా, అన్నివందల గోవులుగా రూపుదాల్చి వారి వారి యిళ్ళకు వెళ్ళాడు. అలా ఒక సంవత్సరం పాటు శ్రీ కృష్ణలీలా వినోదం సాగింది. అప్పుడు బ్రహ్మ క్షమాపణలు చెప్పుకుని తానుదాచిన వారందరినీ శ్రీ కృష్ణునికి అప్పగించాడు.

ఆ విధంగా బ్రహ్మ, ఇంద్రుడు శ్రీకృష్ణుడి అద్భుత శక్తులను లోకానికి చాటే లీలా కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. అందులో యెవరి దోషమూలేదు.

✢ ✢ ✢

తపోభంగాలు

ఎవరైనా తీవ్రంగా తపస్సు చేస్తుంటే ఇంద్రుడు సహించలేడనీ, స్వార్థం, భయం, అసూయ పొందినవాడై వారి తపస్సుకు భంగం

కలిగించేందుకు ప్రయత్నిస్తాడనీ, అప్సరసలను పంపి తపోభంగం చేయిస్తాడని మరో నేరారోపణవుంది.

అయితే తపోభంగం యెవరికి కలిగించాడు? అని పరిశీలిస్తే... సత్సంకల్పంతో లోక కల్యాణార్థం చేసే తపస్సులను భంగం చేయటం మనకు అంతగా కన్పించదు. దుర్మార్గులు, దుష్టసంకల్పం, దురాశగలవారు, అమోఘశక్తులను సాధించి లోక కంటకులుగా మారాలనుకునే వారి తపస్సులను భంగం చేయటం మాత్రం నిజం. రాక్షసులు త్రిలోకాధిపత్యం కోసం, లేక లోకహితం కాని కోరికలు పొందాలని తపస్సు చేసేవారిని చెడగొట్టే ప్రయతన్నాలు ఇంద్రుడు చేసినట్లుగా పురాణాల్లో కనిపిస్తుంది. కానీ వశిష్ఠుడు, కశ్యపుడు, అత్రి యింకా యిలాంటి యెందరో ఋషుల తపస్సు జోలికి యేనాడు వెళ్ళినట్లు కన్పించదు. వాల్మీకి, ధృవుడు, లాంటివారినీ చెరపటానికి చూడలేదు. కానీ ఒకసారి శివుడి తపస్సు చెరిపేందుకు మన్మథుధు, వసంతుడు, రతీదేవిలను పంపించాడు. అది లోక కల్యాణం కోసం కుమారస్వామి జననం కోసం అలా చేశాడు. మరోసారి విశ్వామిత్రుడి దగ్గరకు మేనకను పంపాడు. విశ్వామిత్రుడు అహంకారి, అసూయాపరుడు. వశిష్ఠుడిని అణగదొక్కాలనీ, సృష్టి విరుద్ధమయిన పనులు చేయాలని ప్రయత్నించే విశ్వామిత్రుడి తపస్సు చెరచటానికి ప్రయత్నించటం తప్పుకాదు. నరనారాయణలు తపోభంగానికి అప్సరసలను పంపించాడు. అయితే అది ఊర్వశి జననం కోసం సాగిన జగన్నాటకం... తప్ప సాధారణంగా ఉత్తముల తపస్సులను పాడుచేయటం అంతగా కన్పించటంలేదు. చెడ్డవారిని మాత్రం అధికులు కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేవాడు.

ఒకసారి హిరణ్యకశిపుడు తపస్సుకు వెళ్ళాడు. అతని యింటివద్ద అతని భార్య లీలావతి గర్భవతిగా వుంది. ఆ సమయంలో ఇంద్రుడు ఆమెను, ఆమె గర్భస్థ శిశువును చంపేయాలని ఆమెను ఎత్తుకు పోసాగాడు.

అప్పుడు నారదుడు వచ్చి అడ్డుపడి, నచ్చచెప్పి ఆమెని విడిపించాడు. బాహ్యంగా యిందులో ఇంద్రుడు దుర్మార్గుడు గానే కనిపిస్తున్నాడు. కానీ కాస్త ఆలోచించండి. దుర్మార్గుడైన హిరణ్యాక్షుడిని చంపటానికి శ్రీహరి వరాహరూపం దాల్చవలసి వచ్చింది. హిరన్యాక్షుడ్ని శ్రీహరి చంపినందుకు కక్ష బూని హిరణ్యకశపుడు మహాశక్తుల కోసం తపస్సు చేస్తున్నాడు. ఇక వాడికి పుట్టబోయే తనయుడు యింకెంత దుర్మార్గుడౌతాడో వాడికోసం మరల మరల శ్రీహరి రావాల్సి వస్తుంది. అందుకే ముందే ఆ శిశువును చంపేస్తేముల్లోకాలకు రాగల ఆపద అప్పుతుందని లీలావతిని అపహరించాడు ఇంద్రుడు. కానీ పుట్టబోయే శిశువు దుర్మార్గుడు కాదనీ మహాభాగవతుడిగా చేస్తానని నారదుడు చెప్పగానే ఆమెని వదిలేశాడు ఇంద్రుడు. అంటే దుర్మార్గులనే కాని సన్మార్గులను ఇంద్రుడు చంపడు. అని తెలుస్తుంది కదా!

అలాగే సాగరమదనం కథలో కూడా ఇంద్రుడు సన్మార్గంలోనే కన్పించాడు. మరి తిశంకుడ్ని స్వర్గంలోకి రానీయకుండా యెందుకు త్రోసివేశాడు?

ఈ సాగరమదనం, త్రిశంఖుడి కథల యొక్క అంతరార్థం కావలసినవారు మా “పురాణగాథల్లో సైన్సు అద్భుతాలు” చదవండి.

ఈ విధంగా ఇంద్ర కథల్లో సైన్సు, ఆధ్యాత్మిక, ధార్మిక అంతరార్థాలెన్నో మనకి కనిపిస్తాయి. అయితే ఆ కథలను బాహ్యంగా కాక లోతుగా పరిశీలించాలంతే.

ఇంతవరకు మన పురాణాలలో కొన్ని కొన్ని పాత్రలను ఒకే ఒక కోణంలో చూపిస్తూవచ్చారు పెద్దలు. కానీ మరో కోణంలోంచి చూస్తే మంచి అర్థాలుంటాయనేది నిజం. ఆ మంచి విషయాలను కలకాలం నిలిచేలా చేయాలనే ఋషులు యీ గాధలను అంతరార్థభరితంగా వ్రాశారు.

కానీ మనం... నారదుడు అంటే తగవులమారి. అందరిమధ్య కయ్యాలుపెట్టి ఆనందించుకునే కుంచిత స్వభావుడు. ఏ తగవులు లేకుండా లోకాలు చల్లగావుంటే అతనికి తృప్తివుండదు. కలహాలే అతనికి భోజనం అనే విధంగా పూర్వనుండీ ఒక దుష్టభావనలో వుండిపోయాం. నిజానికి నారదుడంటే గొప్పదేవఋషి, విష్ణుభక్తుడు, బ్రహ్మ కుమారుడు. శాస్త్రీయంగా చెప్పాలంటే శబ్దతరంగాలకు అధిదేవుడు. అందుకే ఒకచోట విషయాలను మరోచోటికి చేరవేస్తుంటాడు. ఆయన యెన్ని తగవులు పెట్టినా లోక కల్యాణం కోసమే. అదే నిజం. కానీ యీ నిజం మనకు అంతగా సహించదు. నారదుడ్ని కయ్యాలమారిగా చిత్రించి రకరకాలుగా వుపన్యాసకులు వర్ణిస్తూ మధ్యమధ్య స్వంతరచనలు చలోక్తులు కలగలుపుతుంటే... అవి విని నమ్మటమే మనకి ఆనందం. నేటిసినిమాలు, టి.వి. పురాణాలు అదే మార్గంలో నడుస్తున్నాయి.

అలాగే ఇంద్రుడు కూడా దుర్మార్గుడు, అవినీతి పరుడు, స్త్రీలోలుడు, మధుపాన ప్రియుడు, పిరికిపంద, అహంకారి... యిలా వర్ణించబడితేనే హర్షించే స్థితిలో వున్నాం. పూర్వం నుండీ అదే అలవాటయింది. మనకి కొందరు వుపన్యాసకులు, నాటకాలవారు, టి.వి.వారు, సినిమాలు... యీ అలవాటును పెంపొందిస్తుంటారు. "అసలు నిజం యిది". అని అంతరార్థాలను వివరించి చెబితే మనకి తృప్తిగా వుండదుకదా!

అంతరార్థాలే కాదు బాహ్యంగా కూడా కొన్ని వేద, పురాణ వర్ణనలు చక్కగా వ్రాయబడినవీ వున్నాయి.

ఇంద్రుడు ప్రకృతి శక్తులకు అధిదేవుడు ఋతువులను నడిపించేవాడు, వర్షాలను కురిపించటంలో మిత్రావరణులను శాసించేవాడు, అగ్ని, వాయువులు మొదలగు ప్రకృతి దేవతలకు నాయకుడు అని వేద పురాణాలు చెబుతున్నాయి.

ఇంద్రుని గొప్పగా కీర్తిస్తూ, ప్రార్థిస్తూ వందలాది వేదమంత్రాలను వ్రాశారు ఋషులు. ఆమాటకొస్తే మొత్తం వేదాలలో అందరు దేవతలకంటే ఇంద్రుని కీర్తించే మంత్రాలే ఎక్కువగా వున్నాయి. అలాంటి ఇంద్రుడు పురాణేతిహాసాలలో కొచ్చేసరికి... అంతరార్థాలు చెప్పటానికో, కథారమ్యత కోసమో కొన్ని కొన్ని చోట్ల కొంత చెడ్డగానూ, హీనంగానూ, వ్రాశారే కానీ ఇంద్రుడు నిజంగా చెడ్డవాడు, హీనుడుకాదు అనే విషయాన్ని వివరించే అనేక అంశాలు వేద, పురాణే, తిహాసాల్లోనే వున్నాయి. కొన్ని వుదాహరణలు చూద్దామా?

ఇంద్రుడు ప్రాణదాత. అమృతంవంటి వర్షజలములనిచ్చును ఆయన సమస్తము యివ్వగలవాడు. ఇంద్రుడు గొప్పవాడు, బలనీతిగలవాడు. ఆయన గోవులను, వర్షమును యిచ్చును. ఇంద్రానీవు దుష్టులను శత్రువులను నాశనం చేయువాడవు ఇంకా యిలాగే ఇంద్రుడు శిష్టరక్షకుడనీ, దుష్టశిక్షకుడనీ, అందరికన్న గొప్పవాడనీ అనేక విధాల వేదాలు కీర్తించాయి.

ఈ వాక్యాలు ఋగ్వేదం 1-8లో తొమ్మిది సూక్తాలలో వివరించబడ్డాయి.

ఇంద్రుడు మిగిలిన దిక్పాలకులు, దేవతలతో కలిసి ఎందరో రాక్షసులను సంహరించి లోకాలకు మేలు చేశాడనీ, కుమారస్వామిని దేవసేనాపతిగా చేసి మరెందరో రాక్షసులను పరిమార్చాడు అని పురాణాలు చెబుతున్నాయి కదా!

రామాయణ కాలంలో దశరధుడి సహాయాన్ని, మహాభారతకాలంలో అర్జునుడి సాయాన్ని తీసుకుని వేలాది రాక్షసులను నశింపచేశాడని రామాయణ, భారతాలు చెబుతున్నాయి.

రామాయణంలో శ్రీరాముడు నేలపైనుండి యుద్ధంచేస్తూ వుంటే రావణుడు రధారూఢుడై మాయా యుద్ధం చేస్తున్నపుడు ఇంద్రుడు ఒక

దివ్యరథాన్ని సారధి మాతలిని శ్రీరాముడికి పంపించి రావణసంహారానికి కూడా సాయంచేశాడు.

ఇలా ఇంద్రుడు చేసిన మంచి పనులెన్నో వున్నాయి.

సకల వేదాలనుచదివేయాలనే తపనతో భరద్వాజ మహర్షి అనంతమయిన వేదరాశిని చదివేందుకు అతని ఆయువు సరిపోలేదని ఇంద్రుడ్ని ప్రార్థించగా అతనికి ఇంద్రుడు మూడువేల సంవత్సరాల ఆయుర్ధాయాన్ని అదనంగా ప్రసాదించాడట.

అంగీరసుని కుమార్తె అయిన 'అకూపార' తనకు కలిగిన మొండి చర్మవ్యాధి నివారణకోసం సామమంత్రాలను కనుగొని ఇంద్రుని ప్రార్థించి తనరోగాన్ని తగ్గించుకుంట.

అలాగే "అపాల" అనే ఆమెకూడా తనకు, తన తండ్రికి కూడా అంకురించిన వ్యాధి నివారణ కోసం కొన్ని ఋక్కులను కనుగొని ఇంద్రుని ప్రార్థించగా వారి రోగాలనూ ఇంద్రుడు నివారించాడు.

ఆ విధంగా వేదాలలో ఘనంగా చెప్పబడిన ఇంద్రుడిని, పురాణలలోని కొన్ని అంతర్ధా ఘటనలను అర్థం చేసుకోలేని మానవులు మరింత వికృత కల్పనలను జోడించి చెడ్డవాడిగా, హీనుడిగా చూపించటం మూర్ఖత్వం.

ముఖ్యంగా ఇంద్రుడు ఇంద్రపదవి, ఇంద్రకథలలో చాలభాగం విజ్ఞాన పూరితమైనవి అనే మాట సత్యం. వాటిని అర్థం చేసుకుంటే వాటి ఆధారంగా మన హైందవ ప్రాచీన వైజ్ఞానిక విశిష్ఠత ప్రపంచంలో యే యితర జాతి, మత, దేశ ప్రజలకూ అందనంత వుత్కృష్టమైనదని, అతి ప్రాచీనమైనదనీ నిరూపించవచ్చు.

